


## పెన్నమ్మకు పోటెత్తుతున్న వరద

అనంతసాగరం : సోమశిల ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరిగింది. పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలకు తోడు కృష్ణాజలాలు వస్తుండగా పెన్నమ్మ పోటెత్తుతోంది. సోమవారం 15,687 క్యూసెక్కులు వస్తుండగా మంగళవారం ఉదయానికి 18,910 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో నీటి నిల్వ 40.787 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో మరింతగా పెరగవచ్చని ఇంజనీర్లు భావిస్తున్నారు. కడప జిల్లా ఆదినిమ్మయాపల్లి గేజ్ వద్ద 20 వేల క్యూసెక్కులు వస్తున్నట్లు గుర్తించారు. వచ్చే వారం రోజులపాటు రోజుకు రెండు టీఎంసీల మేర వరద కొనసాగే సూచనలు ఉన్నాయి.

జిల్లాలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. మూడు పర్యాయాలుగా కేంద్రంలో ఇప్పుడు రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా, జిల్లాలో మాత్రం పార్టీ బలోపేతం కాలేదు. రాష్ట్ర నాయకత్వానికి కూడా జిల్లాలో పార్టీ బలోపేతం కావాల్సిన అవసరం లేదనుకున్నారేమో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పతనాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కేవలం ఐదారుగురు నాయకులే జిల్లా బీజేపీ అనే భ్రమలో నాయకత్వం ఉన్నట్లు కనిపిస్తోంది.



# కమలం వికసించేనా!?

- అధికారంలో ఉన్నా పెరగని పట్టు
- నాయకుల మధ్యే లోపించిన ఐక్యతారాగం
- పక్కపార్టీలవైపు.. కార్యకర్తల చూపు

నెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలే ఏ పార్టీకైనా జీవం. వీరే లేనప్పుడు పార్టీ ఉన్నా అది లేనట్టే లెక్క. కొన్నేళ్ల క్రితం వరకు జిల్లావ్యాప్తంగా కరుడుగట్టిన బీజేపీ కార్యకర్తలు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉండేవారు. నియోజకవర్గ ఫలితాలను శాసించే స్థాయిలో ప్రభావం చూపగలిగేవారు. కానీ గత కొన్నేళ్లుగా నాయకుల తప్పిదాల వల్ల వీరు పార్టీకి దూరం అవుతున్నారు. పార్టీ జాతీయ స్థాయిలో ఉన్న క్రమశిక్షణ ఇక్కడి నాయకుల్లో లేదనే విమర్శలు ఉన్నాయి. వర్గ విభేదాలు ఎక్కువయ్యాయి. కార్యకర్తలు ఒక నాయకుడి వద్దకు వెళితే మరో నాయకుడు కోపగించుకునే పరిస్థితి. నామినేటెడ్ పదవుల్లో, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే పనుల్లో కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం దామాషా ప్రకారం బీజేపీకి కొన్ని పదవులు కేటాయిస్తున్నా నాయకులు వాటిని పక్క పార్టీల వారికి ఇచ్చేస్తున్నారని, లేదా టీడీపీ నాయకులు సిఫారసు చేసిన వారికే ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నారు.

**● పక్కపార్టీల్లోకి వలసలు**

ఇక ఇతర సమస్యలను చెప్పుకోవడానికి జిల్లా నాయకత్వం అందుబాటులో ఉండదని, ఫోన్లకు స్పందించదనే ఆవేదనలు కార్యకర్తల నుంచి వినిపిస్తోంది. ఈ ఆవేదనలు, అసంతృప్తుల ప్రభావం కార్యకర్తలను పక్క పార్టీల్లోకి వలస వెళ్లేలా చేస్తోంది. బీజేపీ భావజాలం ఉన్న జనసేన వైపు పలువురు ఆకర్షితులవుతున్నారు. హడావిడి లేకుండా మౌనంగా ఆ పార్టీ జెండా పట్టుకొంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే క్షేత్రస్థాయిలో బీజేపీ రోజు రోజుకు బలహీనపడుతోంది. ఈ పరిస్థితుల్లో బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పార్టీ స్థితిగతులపై దృష్టి సారించాలని, క్షేత్రస్థాయి కార్యకర్తల మనోగతాలకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ అభిమానులు, సానుభూతిపరులు కోరుకొంటున్నారు.

**బీజేపీ రాష్ట్ర చీఫ్ నేడు రాక**

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తొలిసారిగా బుధవారం నెల్లూరుకు వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం వేదాయపాళెం కూడలి వద్ద చాయ్ పే కార్యక్రమంలో మాధవ్ పాల్గొంటారని తెలిపారు. అనంతరం 10 గంటలకు ఆత్మకూరు బస్టాండ్ వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తారని తెలిపారు. అనంతరం వీఆర్సీ మైదానం నుంచి కస్తూరిబా కళాక్షేత్రం వరకు జరిగే ర్యాలీలో మాధవ్ పాల్గొంటారని తెలిపారు. అనంతరం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారని చెప్పారు.

## కనీస వేతన సలహా బోర్డు చైర్మన్‌గా 'పెళ్లకూరు'

- తెలుగు, సంస్కృత అకాడమీకి ఆర్‌డీ విల్సన్
- నామినేటెడ్ పదవుల్లో జిల్లా నేతలకు స్థానం



పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి



ఆర్డీ విల్సన్

నెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా 31 కార్పొరేషన్లకు మంగళవారం ప్రభుత్వం చైర్మన్లను నియమించింది. ఈ నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు చోటు దక్కింది. ఒకరు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, మరొకరు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌డీ విల్సన్. ఆంధ్రప్రదేశ్ కనీస వేతన సలహా బోర్డు చైర్మన్‌గా శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. మొదటి నుంచీ ఈయన టీడీపీలో కొనసాగుతున్నారు. గతంలో కోవూరు సమన్వయకర్తగా కూడా పని చేశారు. 2024 ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పరిశీలకుడిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. ఇక తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్‌గా ఆర్‌డీ విల్సన్ నియమితులయ్యారు. ఈయన కూడా బీజేపీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా కొనసాగుతున్నారు.



నెల్లూరులోని వైఏంం పాఠశాలలో విద్యార్థులతో ఆల్‌బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

## డీవార్మింగ్ 96.82 శాతం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నివారణ (డీవార్మింగ్)కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలో 96.82 శాతం మంది పిల్లలతో ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించినట్లు వైద్య శాఖ అధికారులు వెల్లడించారు. 5,75,806 మంది విద్యార్థులతో ఆ మాత్రలు మింగించాలని లక్ష్యంకాగా తొలిరోజు 5,51,772 మంది పిల్లలతో ఈ మాత్రలు మింగించినట్లు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం విజయవంతం అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

**నులిపురుగుల సమస్యపై అవగాహన అవసరం**
**వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి**

8లో..

### సీతారామపురంలో నీటిసమస్య

సీతారామపురం : మండలంలోని ఓగూరువారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నీటి సమస్య విద్యార్థులను వెంటాడుతోంది. పక్కనే ఉన్న ఆర్వో ప్లాంట్ నుంచి తరగతికి ఒక బబుల్ ఉచితంగా ఇస్తారని, ఆ నీరు అయిపోతే డబ్బులు పెట్టి కొనాల్సి వస్తుందని విద్యార్థులు తెలిపారు. ప్లాంటు మూసేసినప్పుడు బోరు నీరు తాగుతున్నట్లు తెలిపారు. స్కూల్లో ఉన్న మోటారుకు గ్రామానికి చెందిన ఆరో ప్లాంట్‌కు కనెక్షన్ ఇవ్వడం వల్ల స్కూల్‌కి నీరు సరిపోవటం లేదని, చాలా ఇబ్బందులు పడుతున్నామని వాచ్‌మన్ మోసెస్ తెలిపారు.



స్కూల్లోని బోరు నుంచి ఆర్వో ప్లాంట్‌కు ఇచ్చిన కనెక్షన్

### ఉలవపాడులో అందని గుడ్డు

ఉలవపాడు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 307 మంది విద్యార్థులు ఉండగా మంగళవారం 256 మంది హాజరయ్యారు. 242 మంది మధ్యాహ్న భోజనం చేసినట్లు హాజరు పట్టికలో నమోదైంది. అయితే, మధ్యాహ్నం మెనూ ప్రకారం పులిహోర వడ్డించగా కోడిగుడ్డు పెట్టలేదు. ఈ విషయమై ఉపాధ్యాయులను ప్రశ్నించగా నులిపురుగుల మాత్రలు పంపిణీ ఉన్నందున గుడ్డు తిన్న తరువాత ఆల్బెండజోల్ మాత్ర వేసుకుంటే ఏదైనా ఆరోగ్య సమస్య వస్తుందని గుడ్డు ఇవ్వలేదని చెప్పారు. కాగా, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏజెన్సీని నియమించలేదు. దీంతో ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యం, కోడిగుడ్లు ఒక హోటల్ యాజమాన్యానికి ఇచ్చి, అక్కడ నుంచి భోజనం తెప్పించి వడ్డిస్తున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును వివరణ కోరగా గతంలో ఉన్న ఏజెన్సీ వాళ్లు సరిగా వండకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారని, అందుకే హోటల్‌లో వండించి తెప్పించి పెడుతున్నట్లు చెప్పారు.



ఉలవపాడు : ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించి రేపటి సమాజానికి ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అమలు చేస్తున్న 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' అమలు బాగున్నా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పాఠశాలలకు సన్నబియ్యం పంపిణీ జరుగుతున్నా ముద్దకట్టిన అన్నమే దిక్కుగా మారుతోంది. కొన్నిచోట్ల చౌకడిపో బియ్యాన్నే అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలా జరుగుతోందనే విమర్శలూ నెలకొన్నాయి. దీనికితోడు ప్రతినెలా బిల్లులు అందకపోవడంతో ఇబ్బందిగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 'ఆంధ్రజ్యోతి' బృందం కొన్ని పాఠశాలలను పరిశీలించింది. ఆ వివరాలు క్లుప్తంగా...

# బడి భోజనం బాగున్నా..

- అధికారుల పర్యవేక్షణ ఉంటే మరింత పటిష్టంగా అమలు
- చాలాచోట్ల మంచినీటి కోసం అవస్థలు
- సకాలంలో అందని బిల్లులు
- నిర్వాహకులకు ఆర్థిక ఇబ్బందులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



అల్లూరు : సిమెంటు బస్తా లున్న వరండాలో భోజనం చేస్తున్న పిల్లలు

నెల్లూరు (విద్య), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ హయాంలో 60శాతానికి పడిపోయిన మధ్యాహ్నభోజనం గ్రాఫ్‌ను పరిశీలించిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులు చేపట్టింది. పాఠశాలలకు వచ్చేవారంతా పేద, మధ్యతరగతి విద్యార్థులే అయినా మధ్యాహ్నభోజనం చేయడంలేదని గుర్తించి అందరి అభిప్రాయాల సేకరణతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా పేరు మార్చి సన్నబియ్యంతోపాటు నూతన మెనూను ప్రారంభించింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పిల్లలకు కేవలం రెండు రోజులు మాత్రమే సన్న బియ్యం వడ్డిస్తూ మిగిలిన రోజుల్లో రేషన్ బియ్యాన్నే వాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లాలో అనేక పాఠశాలల్లో ఇదే జరుగుతోందని తల్లిదండ్రులు సైతం నిర్ధారించారు. మరోవైపు నిర్వాహకులకు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో మొక్కుబడిగా మెనూ అమలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. మంచి నీటి సదుపాయం కూడా అంతంత మాత్రంగా ఉండటంతో ఇళ్లనుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. బకాయిలు సకాలంలో మంజూరుకాక పోవడంతో వంట మనిషి, హెల్పర్ నుంచి విద్యార్థుల వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇబ్బందులు చవిచూస్తున్నారు.

| | |
|---|---|
| మొత్తం స్కూళ్లు | : 2,570 |
| విద్యార్థుల సంఖ్య | : 1,48,728 |
| హాజరయ్యేవారు | : 1,35,222 |
| భోజనం చేసేవారు | : 1,31,741 |
| ఏజెన్సీలకు చెల్లించేది | : |
| ప్రాథమిక విద్యార్థికి | : రూ.5.88 |
| ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థికి | : రూ.8.57 |

నిర్వహణ లోపాలను అధికారులు ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది.

**● పెరిగిన ధరలతో..**

పెరిగిన ధరలతో ప్రభుత్వం ఇచ్చే బిల్లులు ఏమాత్రం సరిపోవడం లేదని, బిల్లులు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని నిర్వాహకులు చెపుతున్నారు. గత మూడేళ్లుగా జూనియర్ కళాశాలల్లో నిలిచిపోయిన ఈ పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి పునః ప్రారంభించారు. అయితే వీరికి నేటికీ ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఓ అధ్యాపకుడు తెలిపారు. విద్యాశాఖ అధికారులు దీనిపై మాట్లాడుతూ జిల్లాలో పథకం గతంలో కంటే ప్రస్తుతం చాలా బాగా అమలవుతోందని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేవని చెపుతున్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని చెబుతున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అల్లూరు : ఆర్‌వో ప్లాంటు లేకపోవడంతో డ్రమ్ములోని నీటిని తాగుతున్న బాలుడు

**పాఠశాలలో వసతులు లేక..**

అల్లూరు : పట్టణ పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాల (సుబ్బయ్యబడి)లో కనీస వసతులు లేవు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డిస్తున్నా నిర్వాహకులకు బిల్లుల సమస్య వెంటాడుతోంది. భోజనం చేసేందుకు సరియైన స్థలం లేకపోవడంతో దుమ్మూ ధూళి నిండిన ప్రాంతంలోనే విద్యార్థులు తింటున్నారు. 344 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో నీటి వసతి లేదు. దీంతో క్యాన్ల ద్వారా నీటిని తెచ్చి విద్యార్థుల దాహం తీరుస్తున్నారు.





# రూ.4 కోట్ల స్థలానికి స్కెచ్!

- పొదలకూరులో ప్రభుత్వ భూమి కబ్జాకు విశ్వప్రయత్నం
- నకిలీ డాక్యుమెంట్లతో ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు
- పరిశీలించి వెనక్కి పంపిన రిజిస్ట్రార్
- రెవెన్యూ శాఖలో సమీప బంధువు ద్వారా మంత్రాంగం

పొదలకూరు పట్టణంలో రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలం అది. దీనిపై కన్నేసిన ఓ ఘనుడు పిత్రార్జితం పేరుతో ఏకంగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించాడు. అయితే, వీటిని పసిగట్టిన రిజిస్ట్రార్ ఆయన దరఖాస్తును వెనక్కి పంపారు. ఎలాగైనా ఆ స్థలాన్ని చేజిక్కించుకోవాలన్న ఉద్దేశంతో రెవెన్యూ శాఖలో కీలకస్థాయిలో ఉన్న తన సమీప బంధువు సహాయ సహకారాలు తీసుకుంటున్నట్లు సమాచారం.

\- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

పొదలకూరులో మెయిన్ రోడ్డు పక్కనే పంచాయతీ కార్యాలయం వద్ద సర్వే నెం బరు 191-1ఏలో 34 అంకణాల ప్రభుత్వ ఖాళీ స్థలం ఉంది. దీని విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుందని అంచనా. గతంలో వీఆర్ వ్యవస్థ కొనసాగుతున్న సమయంలో గ్రామ చావడి శిథిల భవనం ఉండేది. కూలేస్థితిలో ఉన్న ఆ భవనాన్ని అధికారులు తొలగించారు. అంతకు మునుపే అక్కడ ప్రభుత్వ పశువుల ఆసుపత్రి ఉండేది. ఆ తర్వాత పంచాయతీ కార్యాలయ భవనంలో స్థలం కలుస్తుండటంతో ఏ శాఖకు చెందిన స్థలమో గుర్తించి రికార్డుపరంగా స్వాధీనం చేసుకోకుండా పంచాయతీ భవనాన్ని ఖాళీ స్థలంలో నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పటి రాపూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఈ భవన నిర్మాణానికి శిలాఫలకం కూడా ఆవిష్కరించారు. అయితే, నిధులు మంజూరు కాకపోవడంతో భవన నిర్మాణం అటకెక్కింది.



ఆక్రమణకు గురికాబోతున్న స్థలంలో తాత్కాలికంగా ఉన్న కూరగాయల అంగడి

**● కోర్టు తీర్పుతో..**

2017లో వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు రవిశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారి భవనాన్ని ఖాళీ స్థలంలో నిర్మించాలని చెత్తాచెదారం తొలగిస్తున్న సమయంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు అడ్డుకున్నారు. దీనిపై రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం నెంబరు 83/17 కేసు ఆరేళ్లపాటు గూడూరు కోర్టులో జరిగి చివరికి 2023, ఫిబ్రవరిలో కొన్ని నిబంధనలతో రెవెన్యూ భవనం నిర్మించేందుకు అనుమతిస్తూ తీర్పు వెలువడింది. ఈ మేరకు కలెక్టర్ అనుమతులు కూడా ఇచ్చారు.

**● నకిలీ డాక్యుమెంట్లతో..**

పొదలకూరు-సంగం రోడ్డుకు చెందిన ఓ వ్యక్తి కన్ను సదరు 34 అంకణాల స్థలంపై పడింది. ఆ స్థలం తనకు పిత్రార్జితంగా లభించిందని పేర్కొంటూ పలువురి డెత్ సర్టిఫికెట్లు పెట్టి ఆ స్థలాన్ని తనకు రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ 2023, సెప్టెంబరులో పొదలకూరు సబ్‌రిజిస్ట్రార్‌కు దరఖాస్తులు అందించారు. అయితే, ఆ డాక్యుమెంట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేయకుండా తోసిపుచ్చారు. ఆర్నెల్ల తర్వాత డాక్యుమెంట్లను తిరిగి ఇచ్చేశారు. ఎలాగైనా ఆ ప్రభుత్వ స్థలాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతో ఇప్పటికీ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. రెవెన్యూ శాఖలో కీలక అధికారిగా ఉన్న తన బావమరిది సహకారం తీసుకున్నాడు. ఆయన సూచనల మేరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు పలు ఫేక్ డాక్యుమెంట్లను పోగు చేసుకున్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆ స్థలాన్ని చేజిక్కించుకునేలా ముమ్మరంగా యత్నిస్తున్నాడు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పొదలకూరు తహసీల్దారుకు పలుమార్లు టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. అయినా స్పందన లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

కోవూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో 13 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఫార్మా, మార్కెటింగ్, మెకానికల్ రంగాల్లో 800 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

**బంగారం, వెండి ధరలు**

| బంగారం (22 క్యారెట్లు) | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 9574 |
| వెండి కిలో ధర | రూ. 116600 |
| వెండి ఒక గ్రాము | రూ. 119.60 |

## ఉచిత కంటి వైద్య శిబిరం

రాపూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ అరవింద నేత్రాలయ పర్యవేక్షణలో స్థానిక షాదీమంజిల్ ఆవరణలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దసంఖ్యలో వృద్ధులు తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ గౌరీశంకర్, సీఈవో సీతారామానాయుడు మాట్లాడుతూ అనుభవం కలిగిన స్పెషలిస్ట్ డాక్టర్లు శ్రీవిద్య, నీలిమ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరం లో 200 మందికి పరీక్షలు నిర్వహించగా, 60 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. 45 మందికి ఉచితంగా కంటి అద్దాలు ఇచ్చామని పేర్కొన్నారు. 60 మందికి ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏవో గల్లా కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది దిలీప్, రాపూరు షాదీమంజిల్ సభ్యులు అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కాలనీలో నాటకాల ప్రదర్శన



బాలనాగమ్మ నాటక ప్రదర్శన

కోవూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాటూరు చెంచమ్మతోపు గిరిజన కాలనీలో మంగళవారం బాల నాగమ్మ, చెంచులక్ష్మి గిరిజన మహాత్యం నాటకాలను తెలుగు భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అద్భుతంగా ప్రదర్శించారు. నాటకాల్ని ప్రజల వద్దకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రదర్శించిన పలు నాటకాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చెంచులక్ష్మి కళామండలి ఆర్గనైజర్ కాకి యానాదయ్య మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు.

## రామలింగేశ్వర ఆలయ కమిటీ నియామకానికి నోటిఫికేషన్

విడవలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రామతీర్థంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఈవో బొగ్గల మల్లికార్జున రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు నామ మాత్రం గా కమిటీని నియమించామన్నారు. ఉత్సవా లు ముగియటంతో ఆ కమిటీని రద్దు చేస్తూ నూతన కమిటీని నియమించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

## మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకండి



మాట్లాడుతున్న ఎస్ఐ నరేష్‌కుమార్

విడవలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల జోలికి వెళితే భవిష్యత్తు నాశనం అవుతుందని ఎస్ఐ నరేష్‌కుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**శక్తి యాప్‌పై అవగాహన సదస్సు**

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ నిరోధానికి శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగా హన కల్పించారు. ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ దీనదయాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ శక్తి టీమ్ సిబ్బంది సుబ్బరాజు, ఏఎస్ఐ రంగయ్య మా ట్లాడారు. మహిళల భద్రత, డ్రగ్స్ నిరోధానికి శక్తి యాప్ ప్రయోజనకరంగా ఉంటుం దన్నారు. శక్తి యాప్ నుంచి సంకేతాలు వచ్చిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుంటారన్నారు.

## అంగన్‌వాడీల ఆందోళన

ఉదయగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాల యం ఎదుట మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కోడె రమణ య్య, రజియా మాట్లాడుతూ గతంలో కార్యకర్తలకు ఇచ్చిన సెల్‌ఫోన్‌లు సక్ర మంగా పని చేయకపోవడంతో తమతోపాటు లబ్ధిదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త ఫోన్లను అందించాలని డిమాండ్ చేశారు.

# ‘విజ్ఞాన’ నిలయాల్లో.. నో పాలి‘ట్రిక్స్’!

**రాజకీయాలకు దూరంగా పాఠశాలలు**

**నాయకులకు ‘నో ఎంట్రీ’**

**అనుమతితో దాతల ప్రవేశం**



కోవూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల

కోవూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన నిలయాలైన పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం మరింత ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దాలని భావిస్తోంది. భావి భారత పౌరులను తయారు చేసే అక్షరధామాలను రాజకీయాల ప్రభావంతో కలుషితం కాకుండా కాపాడేందుకు గట్టి చర్యలు తీసుకుంటోంది. తరగతి గదుల్లోనే కాకుండా విద్యాలయ ప్రాంగణాలపై వివిధ రాజకీయ నాయకులు, విద్యా వవస్థలతో సంబంధం లేని వ్యక్తుల నీడ కూడా పడకుండా ప్రభుత్వ ఉన్నతాధికారులు తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. అభినందనీయం కూడా. ఈ ఉత్తర్వులతో ఒక రకంగా రాజకీయ నాయకులకు పాఠశాలల్లో ‘నో ఎంట్రీ’ బోర్డులు పెట్టినట్లే! పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి విడుదలైన ఈ ఉత్తర్వులపై పలువురు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అనుమతి లేనిదే ప్రవేశం లేదు**

పాఠశాలల్లోకి ఇకపై ఇష్టానుసారంగా ఎవరుపడితే వారు ప్రవేశించేందుకు వీలు లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాలల్లోకి గతంలో మాదిరి ఇకపై వెళ్లాలంటే కుదరదని, బయటి వ్యక్తులను నిరోధించాలని ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ డైరెక్టరేట్ పలు సూచ నలు చేసింది. తరచూ రాజకీయ పార్టీల నాయకులు పాఠశాలల్లోకి వెళ్ళడమూ, తరగతి గదులను రాజకీయ వేదికలుగా మార్చడం తగదని హెచ్చరించింది. పార్టీల జండాలు ఎగురవేయడం, పార్టీ సమావేశాలు ఏర్పాటు చేయడం వంటివి ఇకపై కుదరదని తేల్చి చెప్పింది. విద్యార్థులను అనధికార వ్యక్తులకు దూరంగా ఉంచాలనీ, కరచాలనాల్ని ప్రోత్సహించకూడదని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థుల తలిదండ్రులు పాఠశాలలకు వెళ్ళే వీలుంది. ఎవరైనా దాతలు పాఠశాలలకు విరాళాలు ఇవ్వాలనుకుంటే ప్రధానోపాధ్యాయుడి అనుమతితో పాఠశాలలోకి ప్రవేశించాలని సూచించారు.

**ప్రభుత్వ ఉత్తర్వులు పాటిస్తాం**

ప్రభుత్వ ఉత్తర్వులను ఖచ్చితంగా పాటిస్తాం. పాఠశాలల్లో రాజకీయ కార్యక్రమాలకు అనుమతి ఇవ్వం. ప్రశాంతత నెలకొల్పే ఆలయాలుగా తీర్చిదిద్దుతాం. విద్యార్థుల తలిదండ్రులు, విద్యాకమిటీ సభ్యులను మినహా ఎవ్వరికీ పాఠశాలల్లో ప్రవేశం లేకుండా చర్యలు తీసుకుంటాం.

- రహీమ్, ఎంఈఓ, కోవూరు



**ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి**

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి. విద్యార్థులను రాజకీయ ప్రదర్శన లకు తరలించకూడదు. పాఠశాలల వాతావరణం కలుషితం కా కుండా చర్యలు తీసుకోవాలి.

- ఖాజావలి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

## రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు డీఎన్ఆర్ బాలికలు



బాలికలను అభినందిస్తున్న ఎంఈవో, ఎంపీడీవో

పొదలకూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో పొదలకూరు డీఎన్ఆర్ పాఠశాల బాలికల జట్టు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం శైలజ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభ లో ఎంపీడీవో నరసింహారావు, హెచ్ఎం శైలజ మాట్లాడారు. ఎంపికైనవారిలో ప్రశంసని, లీల, రూప, సల్మా ఉన్నారన్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లో వెంకటసాయిలక్ష్మి, జయశ్రీ, పార్వతి, స్వప్న ప్రియ, హనీ, హేమలతలు ఉన్నారన్నారు. వీరు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంఈవో రేణుక, ప్రధానోపాధ్యాయులు శైలజ, ఫిజికల్ డైరెక్టర్ దేవిక పార్వతి విద్యార్థినులను అభినందించారు.

## బాల్ బ్యాడ్మింటన్‌లో పల్లిపాడు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు

ఇందుకూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. స్టేట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రవీణ్ కుమార్, హేమకళ్యాణ్, భానుచందర్, శ్రావ్య, కావ్య, సింధు, త్రివేణి ఎంపిక య్యారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వీరు పాల్గొంటారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మయ్య, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## పొదలకూరు ఆర్టీసీ బస్టాండు ముస్తాబు



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

పొదలకూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15 వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండును రంగులతో ముస్తాబు చేయనున్నట్లు నెల్లూరు జిల్లా ఆర్టీసీ జోన్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి తెలి పారు. మంగళవారం పట్టణం లోని ఆర్టీసీ బస్టాండును ఆయ న ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండులో జరుగుతున్న పనుల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు చింత గింజల సుబ్రహ్మణ్యం, దాసరి సురేంద్ర బాబు, మామిడి రవీంద్రబాబు, ముక్క శివ కుమార్ గౌడ్, జనార్దన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో రంగనాథన్ జయంతి



రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) వీఎస్‌యూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సభ ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి ఇవాళులర్పించారు. ఆయన విశేషమైన సేవలకు గుర్తింపుగా జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారిణి డాక్టర్ వై సుధారాణి, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **వీఎస్‌యూలో యాంటీ ర్యాగింగ్ డే**

వీఎస్‌యూలో మంగళవారం యాంటీ ర్యాగింగ్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, విశిష్ట అతిథిగా వెంకటాచలం ఎస్ఐ ఆంజనేయులు హాజరయ్యారు. ర్యాగింగ్ చట్టపరంగా శిక్షార్హమైన నేరమన్నారు. ర్యాగింగ్ నివారణకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, స్టూడెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాపూరు :** గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని మంగళవారం రాపూరు గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి అంజయ్య, గ్రంథాలయ సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే కల్లుగీత కార్మికుల అభివృద్ధి



మాట్లాడుతున్న మారుబోయిన జనార్దన్

విడవలూరు, ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ హయాంలోనే కల్లుగీత కార్మికులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని కల్లుగీత కార్మికుల సహకార సంఘాల అధ్యక్షుడు మారుబోయిన జనార్దన్ తెలిపారు. విడవలూరులో మంగళవారం జరిగిన నియోజకవర్గ గౌడ సం ఘం ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొ న్నారు. గౌడ కులానికి మద్యం షాపుల కేటాయింపుల్లో 10 శాతం కేటాయించటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఏనేటి ప్రసాద్, కోసూరు రవి, తాతా బాలకృష్ణ, దాసరి విజయకుమార్, దాసరి మురళి, తాతా ప్రభాకర్, సింహాద్రి అయ్యప్ప, పరుసుగాని వెంకటరమణయ్య, మోర్ల శివప్రసాద్, ఏపూరు సుధీర్, కోసూరు రవి, దాసరి విజయకుమార్, దాసరి మురళీ పాల్గొన్నారు.

## మనుబోలు ఏఎస్ఐగా డీఎం బాబు

మనుబోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మనుబోలు ఏఎస్ఐగా డీఎం బాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పొదలకూరులో ఏఎస్ఐగా పనిచేస్తున్న బాబు ఉన్నతాధికారుల ఆదేశాలతో మనుబోలు పోలీస్‌స్టేషన్‌కు డిప్యూటేషన్‌పై వచ్చారు. ఫిర్యాదులను ఎస్ఐ ఆదేశాలతో పరిష్కరి స్తానన్నారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న ఎంఏవో

ముత్తుకూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వరిలో మేలైన యాజమాన్య పద్ధతులను అవలంభించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయ అధికారిణి జ్యోత్స్నారాణి తెలిపారు. వల్లూరులో మంగళవారం ‘పొలంబడి’ కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర సస్యరక్షణ, ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. పల్లికొండ శీనయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు శశి, ప్రసన్నకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నులి పురుగుల ప్రభావంతో రక్తహీనత



ఇందుకూరుపేట : విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 12, (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల ప్రభావం తో పిల్లల్లో రక్తహీనత సమస్య ఉత్పన్నమవుతుందని బుచ్చి అర్బన్ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ కుమార్, జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్ బాబు పేర్కొన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినో త్సవం సందర్భంగా రూరల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపా ధ్యాయ బృందం పాల్గొన్నారు.

**పొదలకూరు :** ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించామని ఎంఎల్‌హెచ్‌పీ మణిచందన పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో ఏఎన్ఎం చిత్ర ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థినీ విద్యార్థులచే మింగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు మాత్రలు వేశామన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త ప్రభావతి ఉన్నారు.

**ఇందుకూరుపేట :** జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి పరిశీలించారు. అన్ని విద్యాసంస్థల్లో పిల్లలకు మాత్రలు మింగించాలన్నారు. ఆదెమ్మ సత్రం హైస్కూల్లో ఆమె పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బ్రహ్మేశ్వర నాయుడు, డాక్టర్ కిషోర్ కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుధాకర్‌రావు, హెచ్ఈఓ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు రమాదేవి, సతీష్‌బాబు, సీహెచ్ఓ నందిని పాల్గొ న్నారు.

**మనుబోలు:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్య సిబ్బంది మండ లంలో చిన్నారులచే నులిపురుగుల మా త్రలు మింగించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ప్రమోద్ మాట్లాడుతూ నులి పురుగుల మాత్రలను 1నుంచి 19ఏళ్ల లోపువారు వేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

**C.R.I.M.E N.E.W.S**

## గుళికలు తిని గిరిజన యువకుడి మృతి

కావలిరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో గుళికలు తిని గిరిజన యువకుడు సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఆముదాలదిన్నె ఎస్టీకాలనీకి చెందిన గడ్డం రామయ్య(19) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం పూటుగా మద్యం తాగి ఆ మత్తులో కొంగల వేట కోసం ఇంట్లో తెచ్చిపెట్టిన గుళికలు తిని అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు మం గళవారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. కాగా ఆముదాలదిన్నెకు చెందిన టీడీపీ నాయకుడు ఉప్పాల దినేష్ గిరిజన కుటుంబానికి అండగా నిలిచి మృతదేహాన్ని అంబులెన్స్‌లో గ్రామానికి తరలించడంతోపాటు అంత్యక్రియలు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నాడు.

## యువకుడి బలవన్మరణం



కిషోర్ (ఫైల్)

రాపూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిద్ధలయ్య సెంటర్‌కు చెందిన బక్కి కిషోర్ (25) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకోగా, చుట్టుపక్కల వారు గమనించి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ వెంకటరాజేష్ తెలిపారు.

## ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ అనుమానాస్పద మృతి



సీటులోనే కుప్పకూలి మృతి చెందిన శ్రీనివాసులు

రాపూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులిగిలపాడు వద్ద ఉన్న ఎస్ఎల్వీ స్టోన్ క్రషర్‌లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పులిగిలపాడుకి చెందిన గుర్రం శ్రీనివాసులు (35) అనుమానాస్పదంగా మృతి చెందాడు. మంగళ వారం ఉదయం ఎక్స్‌కవేటర్ ఆపరేట్ చేస్తుండగా గుండె పోటుతో సీటులోనే కుప్పకూలి మృతి చెందాడని అక్కడి అధికారులు మృతుడి బంధువులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తు న్నారు. ఈ ఘటనపై మృతుడి బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు...

ముత్తుకూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఈనెల 2వ తేదీన నెల్లూరు రహదారిపై ముత్తుకూరు మద్దిమాను సెంటర్‌లో వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైకును ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, చలివేంద్రకు చెందిన శ్రీరాములు హర్షవర్ధన్ (18) తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరులోని ప్రైవేటు వైద్యశాలలో పది రోజులుగా చికిత్స పొందుతున్న హర్షవర్ధన్ మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

## డీటీతో వాగ్వాదం.. వ్యక్తిపై ఫిర్యాదు

మనుబోలు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జట్లకొండూ రుకు చెందిన చీకటి సుధాకర్ అనే వ్యక్తిపై రెవెన్యూ సిబ్బంది మం గళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్న సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌తో వాగ్వాదానికి దిగాడు. పెద్దగా కేకలు వేస్తూ, ఫైల్స్ విసిరి గొట్టి, దు రుసుగా ప్రవర్తించాడు. డీటీ ముందున్న బెంచీని తోసే ప్రయత్నం చేసి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో చీకటి సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలని 9మంది రెవెన్యూ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## లైంగికదాడిపై అట్రాసిటీ డీఎస్పీ విచారణ

సంగం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ గిరిజన మహిళపై జరిగిన లైంగిక దాడి ఘటనపై నమోదైన కేసులో మంగళవారం అట్రాసిటీ డీఎస్పీ జీ శ్రీనివాసులు విచారణ చేశారు. ఈ నెల 3న మామిడి తోటలో కాపలా ఉన్న గిరిజన మహిళపై అదే తోట యజమాని లైంగికదాడికి పాల్పడడంతో కేసు నమోదైన విషయం విదితమే. ఈ కేసుపై ఇప్పటికే స్థానిక డీఎస్పీ విచారించారు. అయితే లైంగిక దాడికి గురైన మహిళ గిరిజన మహిళ కావడంతో అట్రాసిటీ డీఎస్పీ శ్రీనివాసులు సంఘటన స్థలానికి వెళ్లి బాధితురాలిని, సాక్ష్యులను విచారించారు. ఆయన వెంట సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ ఉన్నారు.

## మరో కేసులో కాకాణికి బెయిల్

నెల్లూరు (లీగల్),ఆగష్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ భూముల స్వాహా కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు నగర మొదటి తరగతి రెండవ అదనపు న్యాయాధికారి యల్ శారదారెడ్డి మంగళవారం ఉత్తర్వు చేశారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో మోసం, దగా కుట్రలతో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి రికార్డులను తారుమారు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారన్న కేసులో కాకాణి 14వ నిందితుడిగా ఉన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్నాక కాకాణికి బెయిల్ మంజూరు చేస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

## ‘రియల్’ పెట్టుబడులకు నగదు ఎక్కడిది!?

- మైన్స్ డబ్బు ఎక్కడ దాచారు!
- శ్రీకాంత్‌పై పోలీసుల ప్రశ్నల వర్షం
- తొలిరోజు ముగిసిన విచారణ

నెల్లూరు (క్రైం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు, కావలి, గూడూరు, తిరుపతి ఇతర ప్రాంతాలలో రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన వెంచర్లు వేయడానికి మీకు నగదు ఎక్కడ నుంచి వచ్చింది? ఎన్నికల సమయంలో ఈ రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన నిధులు ఎవరెవరికి అప్పగించారు? మైన్స్‌కు సంబంధించి నగదును ఎక్కడ దాచిపెట్టారు? ఇలా అనేక ప్రశ్నలను వైసీపీ నేత బిరదవోలు శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు ప్రశ్నించారు. కోర్టు అనుమతులతో మంగళవారం జిల్లా సెంట్రల్ జైలు నుంచి పోలీసులు శ్రీకాంత్‌రెడ్డిని తమ కస్టడీలోకి తీసుకున్నారు. డీటీసీలో శ్రీకాంత్‌రెడ్డిని రుస్తుం మైన్స్‌కు సంబంధించి 30 ప్రశ్నలను అడిగారు. ఈ క్రమంలో అనేక నివ్వెరపోయే సమాధానాలు వెల్లడించినట్లు సమాచారం. పోలీసులు అడిగిన ప్రతి ప్రశ్నకు సానుకూలంగా సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ప్రధానంగా మైన్స్‌కు సంబంధించిన నగదును ఎన్నికల సమయంలో వినియోగించినట్లు చెప్పారని సమాచారం. ఈ క్రమంలో పోలీసులు తొలిరోజు విచారణ పూర్తి చేసి మిగిలిన రెండు రోజుల్లో ఏ ప్రశ్నలు అడగాలన్నదానిపై పోలీస్ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 118 |
| స్కిన్ చికెన్ | 216 |
| స్కిన్‌లెస్ | 240 |

కోడిగుడ్ల ధర (100): 520

## భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి) : శ్రావణ మంగళవారం సందర్భంగా రాజరాజేశ్వరి ఆలయంలో రాత్రి కాత్యాయనీ వ్రతం జరిగింది. అమ్మవారికి కాత్యాయినీ అలంకారం ఆకట్టుకుంది. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

## వైభవంగా వైభవ లక్ష్మీదేవి పూజ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మంగళవారం వైభవలక్ష్మీదేవి పూజ వైభవంగా జరిగింది. ఆవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో 108 నాణేలు, 11 రకాల పూలు, అరటి పండ్లు, ఇతర పూజా సామగ్రితో పూజను ఆలయ ప్రధాన అర్చకుడు శివకుమార్‌స్వామి చేయించారు. సాయంత్రం అమ్మవారికి పూలంగి సేవ జరిగింది. రాత్రి ముత్తైదువులకు పసుపు కుంకుమలు పంచారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, ఎంపీ ఆంజనేయులు పర్యవేక్షించారు.

**న్యూస్ బాక్స్**

## ట్రాఫిక్ సిగ్నల్స్ ఎక్కడ

- రూ. 2.41 కోట్లు ఏమైనట్టు..?
- కమిషనర్‌ను కోరిన కార్పొరేటర్లు కర్తం, రవి

నెల్లూరు(సిటీ), ఆగస్టు, 12,(ఆంధ్రజ్యోతి) : నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు కార్పొరేషన్ ఖజానా నుంచి ఖర్చు చేసిన రూ. 2.42 కోట్లు ఏమయ్యాయి?, సిగ్నల్స్ ఎక్కడపెట్టారో ప్రజలకు తెలిపాలని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, 5వ డివిజన్ కార్పొరేటర్ రవి కమిషనర్ నందన్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఎన్ఎంసీలో ఆయనకు వినతి పత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ 2023 నుంచి 2025 వరకు విడతల వారీగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు ఏకంగా రూ. 2.41 కోట్లు కేటాయింపులు జరిపారన్నారు. కానీ ఒక్కదగ్గర కూడా వాటిని ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఈ మొత్తం నిధులు ఎవరికిచ్చారు...? సిగ్నల్స్ ఎందుకు ఏర్పాటు చేయలేదు...? జాప్యమెందుకు జరుగుతోంది...? అనేది ప్రజలకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి శ్రీధర్, నాయకులు రామాంజనేయరెడ్డి, మన్నే శ్రీనివాసులురెడ్డి, రేణుక శ్రీను, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పీ 4లో భాగస్వాములు కండి

- కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వర్ణాంధ్ర-2047లో భాగంగా పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కార్పొరేషన్ కమిషనర్ నందన్ పలువురు వ్యాపారులను కోరారు. మంగళవారం నగరంలోని పలు బంగారు జ్యూయలరీ షాపులకు ఆయన వెళ్లి, వాటి యజమానులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు చేయూతనివ్వాలని కోరారు. అనంతరం పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య పనులపై ఆరా తీశారు. కార్పొరేషన్‌లో రెవెన్యూ విభాగంపై వారాంతపు సమీక్ష నిర్వహించారు.

## ఘనంగా ఆదిశంకర ధ్యాన మందిరం వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆదిశంకరాచార్య స్వామి, పరివార దేవతలు, పాదుకలకు విశేష అభిషేకాలు అర్చన జరిగాయి. సాయంత్రం గాత్రకచేరీ, ఆధ్యాత్మిక సభ జరిగాయి. రామకృష్ణ పరమహంస మోక్ష ముక్తి సాధనలకు భక్తి కర్మ మార్గాలను ఎంచుకున్నారని శ్రీరామకృష్ణమిషన్ నెల్లూరు శాఖ కార్యదర్శి హృదానందజీ మహరాజ్ తెలిపారు. కార్యక్రమంలో చక్రాల వారి ట్రస్ట్ ఎండీ ఆనంద్‌కుమార్, మేనేజర్ సమయానంద, రామకృష్ణమిషన్ సభ్యులు లక్ష్మీనారయణ, జయప్రకాష్, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 61 మందికి ఎన్‌హెచ్‌డీపీ ప్రయోజనం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ హస్తకళల అభివృద్ధి కార్యక్రమం(ఎన్‌హెచ్‌డీపీ) కింద నెల్లూరు జిల్లాలో మూడేళ్లగా 61 మంది చేతివృత్తుల వారు ప్రయోజనం పొందారని కేంద్ర జౌళిశాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా చెప్పారు. లోక్‌సభలో మంగళవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ విధంగా సమాధానం ఇచ్చారు. చేతి వృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఆర్థిక సహాయం అందచేయడానికి, ఆంధ్రప్రదేశ్‌సహా దేశ వ్యాప్తంగా చౌపల్ వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## 18న చలో కరేడు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కరేడు భూ సమస్యలపై ఈ నెల 18వ తేదీన చలో కరేడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు షేక్ షాన్‌వాజ్, గంగపట్నం రమణయ్య వెల్లడించారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. భూ సేకరణ చట్టానికి విరుద్ధంగా ఇండోసోల్ కంపెనీకి భూములు కట్టబెట్టడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నందయ్య, మహిళా సంఘం నాయకురాలు శిరీష పాల్గొన్నారు.

## దివ్యాంగుల మోటారు వాహనాలకు దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలు ఉచితంగా అందించేందుకు 47వ డివిజన్‌లో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ కుమార్ దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. మంగళవారం డివిజన్‌లోని దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి ఈ దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలు ఉచితంగా ఇచ్చేందుకు చర్యలు చేపట్టిందని చెప్పారు. ఈ నెల 31లోపు ఆ వాహనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# గణపయ్యా... పీవోపీ వద్దయ్యా!

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో వినాయక విగ్రహాల తయారీ
- పర్యావరణం, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- నిమజ్జనంతో జలకాలుష్యం
- గర్భస్థ పిండానికీ అనర్థమే!
- మేలుకోకుంటే భావితరాలకు పెనుముప్పు
- మట్టి విగ్రహాలనే పూజించాలి : నిపుణులు

వినాయక చవితి రాబోతోంది. ఇది ప్రకృతి పండుగ. ఈ సీజన్‌లో లభించే రకరకాల పత్రాలు, పుష్పాలు, ఫలాలను విఘ్నేశ్వరుడికి అర్పించి పూజించడం తద్వారా ప్రకృతితో మమేకమై జీవించాలని చెప్పడమే దీని అంతరార్థం. అందుకనే గణపతి ప్రతిమను కూడా ప్రకృతిలో భాగమైన మట్టితోనే చేస్తారు. శాస్త్రం కూడా మట్టి గణపతినే పూజించాలని చెబుతోంది. అయితే ఆధునిక సమాజంలో కళ్లకు ఆకర్షణ, పోటీతత్వంతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలపై మోజు పెంచుకుంటున్నారు. వాటివల్ల పర్యావరణానికి, జంతుజాలం మనుగడకు ప్రమాదమని నిపుణులు మొత్తుకుంటున్నా ఎవరూ వినడం లేదు. ప్రజల్లో మార్పు రాకపోతే భావి తరాలకు పెనుముప్పు తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.



పీవోపీ విగ్రహాలకు తుదిమెరుగులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పండుగ. ఈ నేపథ్యంలో జిల్లాలో గణపతి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. భారీ సంఖ్యలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. అయితే ఇవి పర్యావరణానికి హానికరం. మనుషులు, మూగజీవాల ఆరోగ్యానికి చేటు చేస్తాయి. ఈ నేపథ్యంలో బంకమట్టి విగ్రహాలనే పూజించాల్సిన అవసరం ఉంది.

### మేలుకోకపోతే ఎన్నో అనర్థాలు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలలో అనేక రసాయనాలు మిళితమై ఉంటాయి. ప్రమాదకరమైన లెడ్, పాదరసం, సీసం వంటివి కూడా ఉంటాయి. వినాయక చవితి పూర్తైన తర్వాత విగ్రహాలను నదులలో కాని, చెరువుల్లోగానీ కలుపుతారు. దీని వలన ఆ విగ్రహాలలో ఉన్న ప్రమాదకర రసాయనాలు నీటిలో కలిసి భూ ఉపరితలంపై పేరుకుపోతాయి. దీని వల్ల భూగర్భ జలాలు ఇంకి పోయే అవకాశం కూడా ఉంది. రసాయనాలు కలిసిన నీటిని తాగడం వల్ల మనుషులు, జంతువులు, జలచరాలు తీవ్ర అనారోగ్యం బారినపడ తాయి. పీవోపీ విగ్రహాల్లోని కాల్షియం, మెగ్నీషియం, సిలికాన్ వంటి భార లోహాలు నీటిలో కలిసి మానవ మనుగడను ప్రశ్నిస్తున్నాయి.

**రసాయనాలు ప్రమాదకరం..**

- నీటిలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను కలపడం వల్ల కొన్నిరోజులపాటు ఆ నీటిలో రసాయనాలు మిళితమై ఉంటాయి.
- వాటిని తాగడం వల్ల శ్వాసకోశ వ్యాధులు ప్రబలి తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది.
- ఆ రసాయనాల వల్ల చర్మ వ్యాధులు వస్తాయి. వాటిలోని భార లోహాలు మెదడుపైనా ప్రభావం చూపుతాయి.
- గుండె, మూత్రపిండాలు, నాడీ వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. రక్తకణాలు కూడా దెబ్బతినే అవకాశం ఉంది.
- రసాయనాలు కలిసిన విగ్రహాల నిమజ్జనంతో కలుషితమయ్యే నీరు తాగడం వల్ల డయేరియా(అతిసారా) వంటి వ్యాధులు ప్రబలుతాయి.

### మూడు వేలకుపైగా విగ్రహాల నిమజ్జనం

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. వీధి వీధిన విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. పోటీతత్వంతో పెద్ద పెద్ద విగ్రహాలు ప్రతిష్ఠిస్తున్నారు. వాటిలో 98 శాతం ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలే. బంక మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలని పర్యావరణవేత్తలు పదేపదే చెబుతున్నా ఎవరూ ఆచరించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఏటా మూడు వేలకుపైగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలతో ఉత్సవాలు జరిపి ఆ తర్వాత వాటిని నీటిలో నిమజ్జనం చేస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది.



నగరంలో తయారు చేస్తున్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలు

### ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుంది. నీటిలో ఆ విగ్రహాలు కలపడం వల్ల అవి నీటిలో కరగడానికి నెలరోజులకుపైనే పడుతుంది. పైగా వాటిలోని రసాయనాలు నీటిలో తద్వారా భూమి పొరల్లో చేరి పర్యావరణానికి చేటు కలిగిస్తాయి. భూగర్భ జలాలు కూడా కలుషితమయ్యే అవకాశం ఉంది. అలాంటి నీటిని తాగడం వల్ల గర్భవతులు తీవ్ర అనారోగ్యానికి గురవుతారు. గర్భస్థ శిశువు అవయవ లోపంతో పుట్టే అవకాశం ఉంది. దీనిపై విస్తృత ప్రచారం చేస్తున్నాం.

- డాక్టర్ కాలేషా, జీజీహెచ్ జనరల్ సర్జన్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు

### పర్యావరణం దెబ్బతింటుంది



పీవోపీతో వినాయక విగ్రహాల తయారీ వల్ల పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వాటి నిమజ్జనంతో నీలు కలుషితమై ఊపిరితిత్తుల వ్యాధులు సంక్రమిస్తాయి. ప్రతీ ఏటా జిల్లాలో పీవోపీ విగ్రహాల సంఖ్య పెరుగుతూనే ఉంది. సంప్రదాయబద్ధంగా, ప్రకృతికి విఘాతం లేని విధంగా పండుగ జరుపుకోవాలి.

- డాక్టర్ ఏవీ రమణయ్య, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

## నాయీ బ్రాహ్మణులకు టీడీపీ అండ

- ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : నాయీ బ్రాహ్మణులకు తెలుగుదేశం ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్, టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ అన్నారు. నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చిన సందర్భంగా నగరంలోని నర్తకి సెంటర్‌లో సంబరాలు చేశారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊపుటూరి బాలగురుస్వామి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి కేక్ కట్ చేశారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అజీజ్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల వారు ఆర్థికంగా స్థిరపడాలన్న ఆలోచనతో 40వేల సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామన్న ఎన్నికల హామీని చంద్రబాబు నాయుడు నెరవేర్చారని చెప్పారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు ఎజెండాగా చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచల బాబు యాదవ్, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కప్పిరి శ్రీనివాసులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అజీజ్, కోటంరెడ్డి, బాలగురుస్వామి తదితరులు

## స్విగ్గీ డెలివరీ బాయ్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్విగ్గీ వర్కర్ నాగరాజుపై నగరంలోని మురళీకృష్ణ హోటల్‌లో దాడి చేయటం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంవీ రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ఎంతో మంది చదువుకున్న యువత స్విగ్గీ, జొమోటో, బ్లింక్ ఇన్ వంటి సంస్థల్లో డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నారని చెప్పారు. హోటల్ మురళీకృష్ణ యాజమాన్యం నాగరాజుపై దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్విగ్గీ వర్కర్ రాజేష్ మాట్లాడుతూ తమ రైడర్‌కు హోటల్ యాజమాన్యం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బీపీ నరసింహ, నరేంద్ర, స్విగ్గీ వర్కర్స్ మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ

## పాఠశాలల్లో డీవార్మింగ్ డే

నెల్లూరు(విద్య), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో నులి పురుగుల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డీవార్మింగ్ డేను నగరంలోని పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. కోటమిట్ట మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ రమేష్ పాల్గొన్నారు. నులిపురుగుల వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మలేరియా అధికారి డాక్టర్ హుస్సేనమ్మ, హెచ్ఎం ఖాజా రహంతుల్లా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



గుడిపల్లిపాడు పాఠశాలలో విద్యార్థికి మాత్ర వేస్తున్న వైద్యుడు

- బుజబుజ నెల్లూరులోని శేష పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించాయి. పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆరోగ్యవంతమైన చిన్నారుల కోసం నులిపురుగుల నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ నాయకుడు, కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి అన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ హాస్పిటల్స్ కోఆర్డినేటర్ కే వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, కరస్పాండెంట్ బీ ఆదిశేషు, పీహెచ్‌సీ నాయకుడు వేణుగోపాల్, శ్రీనివాసులు, శేషయ్య పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్‌లో....

నెల్లూరు రూరల్ : పాఠశాలలో చదువుకునే పిల్లలు నులిపురుగుల మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలని అల్లీపురం పీహెచ్‌సీ వైద్యుడు బలరాంనాయక్ తెలిపారు. గుడిపల్లిపాడు నేతాజీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు మాత్రలు వేశారు.

## రాహుల్ అరెస్టు దారుణం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్ రెడ్డి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని అరెస్టు చేయటం దారుణమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నెల్లూరులోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కు చోరీకి గురవుతోందని రాహుల్‌గాంధీ ఆధారాలతో నిరూపించి 300 మంది ఎంపీలతో నిరసన తెలియచేస్తే ఆయన్ను అరెస్టు చేయటం ప్రజా స్వామ్యానికి చీకటి రోజని పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ బీజేపీ జేబు సంస్థగా మారిందని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వంలో అసంబద్ధంగా జిల్లాల నుంచి వేరు చేసిన గూడూరు, కందుకూరును తిరిగి వాటి పూర్వ జిల్లాల్లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, నాయకులు హరి, సుధీర్, మల్లికార్జునరెడ్డి, ధనుంజయ, అల్లాఉద్దీన్. ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్‌రెడ్డి

## క్యాన్సర్ బాధితుల కోసం కాల్ సెంటర్

- అపోలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ బాధితులకు అపోలో ఆసుపత్రి బాసటగా నిలుస్తుందని, దేశంలోనే తొలిసారిగా క్యాన్సర్ కేర్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ వెల్లడించారు. మంగళవారం నగరంలోని అపోలో ఆసుపత్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. క్యాన్సర్ రోగులకు అత్యవసర పరిస్థితి ఏర్పడితే 1800 - 203 1066 నెంబర్‌కు ఫోన్ చేస్తే వైద్య నిపుణులు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు హరిత, జీవీవీ ప్రసాద్, ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్ సతీష్

## ఆర్ఎన్ఆర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి : పీడీఎస్‌యూ

నెల్లూరు(విద్య), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని మృతికి కారణమైన ఆర్ఎన్ఆర్ జూనియర్ కళాశాల గుర్తింపు రద్దుచేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఇస్కాన్‌సిటీ సమీపంలో ఉన్న కళాశాల ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ల్లా కార్యదర్శి షేక్ షారుఖ్ మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థిని మృతి అందరినీ కలిచి వేసిందన్నారు. చదువుల పేరుతో తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుండడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్, హర్ష, వశీం, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.





ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

## అన్నదాత బాగుంటే దేశం బాగుంటుంది

- సౌత్‌మోపూరు సంఘీభావ ర్యాలీలో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఆగస్టు, 12,(ఆంధ్రజ్యోతి) : ఎక్కడైనా అన్నదాత ఆర్థికంగా బాగుంటే ఆ దేశం సుభిక్షంగా ఉంటుందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. అన్నదాత సుఖీభవ పథకంతో రైతుల ఖాతాల్లో నగదు జమైనందున మంగళవారం సౌత్‌మోపూరు గ్రామంలో రైతులతో కలిసి సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతు బాగోగులను సీఎంగా చంద్రబాబు మాత్రమే చూసుకోగలడని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, జలదంకి సుధాకర్, పముజుల ప్రదీప్, రాపూరు చంద్రశేఖర్, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

## జీజీహెచ్‌లో కుక్కలు, పందుల నివారణకు చర్యలు

- కార్పొరేషన్ హెల్త్ అధికారి కనకాద్రి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కుక్కలు, పందులు లేకుండా చర్యలు తీసుకుంటానని నెల్లూరు కార్పొరేషన్ హెల్త్ అధికారి డాక్టర్ కనకాద్రి తెలియచేశారు. ఆయన మంగళవారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ప్రాంగణంలో పందులు, కుక్కలు తిరగడంపై వైద్యులు, రోగులు ఆందోళన వ్యక్తం చేయడంతో వాటి నివారణకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, పారిశుధ్య పర్యవేక్షకుడు విజయ్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు నెరవేర్చాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో వడ్డెరలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జీ దయాకర్, జిల్లా అధ్యక్షుడు కే వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జర్నలిస్టు భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెరలు మట్టి పని, క్వారీల్లో, గుట్టల్లో, కొండలు, బండలు పగలగొట్టడం, తదితర చేతి వృత్తులు ద్వారా 50 సంవత్సరాలకే వృద్ధులవుతున్నారని తెలిపారు. వడ్డెరలకు వృద్ధాప్య పింఛన్లు ఇస్తామని, క్వారీల్లో గుట్టల్లో సముచిత స్థానం కల్పిస్తామన్న హామీలు నెరవేర్చాలని, వడ్డెర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

## చేనేతలకు పదవిపై హర్షం

నెల్లూరురూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : తాజాగా ప్రభుత్వం పీఏసీఎస్ చైర్మన్ పదవిని చేనేత కుటుంబాలకు కేటాయించినందుకు చేనేత ఐక్య కార్యచరణ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. పీఏసీఎస్ చైర్మన్ ఎంపికైన పముజుల ప్రదీప్‌ను మంగళవారం సౌత్‌మోపూరు గ్రామంలో సన్మానించింది. కమిటీ నాయకులు బాలాజీ, రామసుబ్బయ్య, సోమగోపాల్ పాల్గొన్నారు.

## ఆ శంకరుడే ఆదిశంకరుడు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కాలి నడకన మూడు సార్లు ఆసేతు హిమాచలం పర్యటించి, సనాత ధర్మ స్థాపన చేసిన మహనీయుడు ఆదిశంకరాచార్యులు సాక్షాత్తు కైలాస శంకరుడేనని ఆధ్యాత్మిక ప్రవచకుడు జీవీఎస్‌ఏ వర ప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం రాత్రి వర్ధమాన సమాజంలో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన ప్రవచించారు.

# త్వరితగతిన నియామకాలు

● జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో ఎప్పటికప్పుడు పదోన్నతులు, కారుణ్య నియామకాలు త్వరితగతిన జరుపుతున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. జడ్పీ కార్యాలయంలో మంగళవారం 17 మందికి పదోన్నతులు, ఇద్దరికి కారుణ్య నియామక ఉత్తర్వులను జడ్పీ సీఈవో మోహన్‌రావుతో కలిసి ఆమె అందించారు. 2021 నుంచి ఇప్పటి వరకు 137 మందికి ఉద్యోగోన్నతి, 83 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. ఉద్యోగులు శ్రద్ధగా, బాధ్యతగా పనిచేసి ప్రజలకు మేలు చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పక్కన సీఈవో మోహన్‌రావు

## మత్తులో తూగుతున్న బాల్యం



కలువాయిలోని పలువురు చిన్నారులు మత్తుకు అలవాటుపడ్డారు. గుడ్డలో నెయిల్ పాలిష్ రిమూవర్ వేసుకుని, దాన్ని చెండులా మడిచి నోటి ద్వారా పీల్చుతున్నారు. ఈ రకమైన మత్తుకు కొంతకాలంగా వారు అలవాటు పడ్డారు. బస్టాండు, బజార్లలో వారు తిరుగుతూ మత్తులో జోగుతుండడంతో వారి ఆరోగ్యంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఈ అలవాటును మాన్పించకుంటే భవిష్యత్తులో మత్తుకు బానిసలవుతున్నారు. ఇలావారు మత్తు పీల్చడం చాలా ప్రమాదకరమని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం.విజయ లక్ష్మి, డాక్టర్ రమ్య తెలిపారు. ఇందువల్ల ఊపిరి తిత్తులు, బ్రెయిన్‌పై ప్రభావం చూపడంతోపాటు పేగుల్లో అల్సర్లు వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

## రాళ్ల దారిలో రాకపోకలు ఎలా..?

వరికుంటపాడు మండల పరిధిలోని జీ.కొత్తపల్లికి వెళ్లాలంటే ప్రజలు హడలిపోతున్నారు. ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు సరిహద్దు గ్రామం ఇది. ప్రధానరహదారి నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు ఉన్న రహదారి రాళ్లు తేలడంతో వాహనదారులు నానాయాతన పడుతున్నారు. దారి పొడవునా గుంతలమయంగా దర్శనమిస్తుండ డంతో అటుగా వెళ్లాలంటేనే భయపడిపో తున్నారు. పైగా గ్రావెల్ రహదారి కావడంతో ఎక్కడ జారి పడతామోనని బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



- వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి)



తొలి కాన్పునకు రూ.5వేలు

రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6వేలు

## తల్లీబిడ్డ సంక్షేమానికి

# మాతృ వందనం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : కాబోయే అమ్మకు ప్రధాన మంత్రి మాతృవందనం పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. మాతా, శిశు సంక్షేమానికి కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్ద పీట వేస్తోంది. ఆర్థిక సమస్యల కారణంగా కొంతమంది గర్భిణులు ప్రసవం తరువాత బిడ్డలకు సకాలంలో పోషకాహా రాన్ని అందించలేకపోతున్నారు. అవసరమైన టీకాలు సైతం వేయించలేక పోతున్నారు. ఇలాంటి ఇబ్బందులు లేకుండా తల్లీబిడ్డ సంక్షేమం కోసం ఈ మాతృవందనం పథకాన్ని స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద తల్లులకు ఆర్థిక సహాయం అందుతుంది. బాలింతల్లో రక్తహీనత నిర్మూలన, పోషకాహారాన్ని పెంపొందించాలన్న సంకల్పంతో దీన్ని చేస్తున్నారు. జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 2705, మినీ అంగన్ వాడీ కేంద్రాలు 229 మంది ఉన్నాయి. వాటి పరిధిలో గర్భిణులు 14207 మంది, బాలింతలు 13078 మంది ఉన్నారు. కాగా, మాతృవందనం పథకం కింద మహిళ తొలి కాన్పుకు రూ.5వేలు ఇస్తారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే దశల వారీగా రూ.6వేలు వారి ఖాతాల్లో జమచేస్తారు.

### ఎవరు అర్హులంటే :

- తెల్లరేషన్ కార్డులందరూ మాతృవందనం పథకానికి అర్హులు.
- గర్భం దాల్చగానే దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలను సంప్రదించి ఆధార్‌తోపాటు ఇతర వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది.
- అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసిన తరువాత కొన్ని నెలలకు రూ1000, ప్రసవం అనంతరం రూ.2వేలు, బిడ్డకు ఏడాది వయసులో టీకాలు వేయిం చటం పూర్తయిన తరువాత రూ.2వేలు చొప్పున తనల్లి ఖాతాలో జమచేస్తారు.
- రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.2వేల వంతున మూడు విడతల్లో అందచేస్తారు.



నెల్లూరులోని కొండాయపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది (ఫైల్)

### వివరాలు నమోదు చేయిస్తున్నాం



ప్రధాన మంత్రి మాతృ వందనం పథకం కింద లబ్ధి చేకూర్చడానికి గర్భవతుల వివరాలు నమోదు చేయిస్తున్నాం. నమోదు తర్వాత సీడీపీవోల ట్యాబ్‌లకు ఓటీపీ వస్తుంది. అర్హులైన వారు అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

- హేనా సుజన్, ప్రాజెక్టు డెరెక్టర్, ఐసీడీఎస్

● నిబంధనలకు తిలోదకాలు ● యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు

● మోసపోతున్న సామాన్యులు ● పట్టించుకోని అధికారులు

## మెట్టలో జోరుగా

# రియల్ దందా

ఉదయగిరి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో రియల్టర్లు నిబంధనలకు తిలోద కాలు ఇచ్చి యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వేస్తున్నారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగిన అక్రమ రియల్ దందాకు నేడు కూడా కొనసాగుతున్నది. రోజుకో ప్రాంతంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.

### ● అధికార పార్టీ నేతల అండ

కొంతమంది అధికార పార్టీ నేతల అండతో పంచాయతీ అనుమతులు కూడా పొందని వ్యాపారులు ఇష్టానుసారంగా రియల్ వ్యాపారం సాగిస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వ్యాపారులకు అనుకూలంగానే అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారు. అంతేకాక అనుమతులు ఉన్నాయని బుకాయిస్తున్నాయి. నిన్నటి వరకు జాతీయ రహదారులు, పట్టణాలకు సమీపంలోని ప్రాంతాల్లో మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్న ఈ వ్యాపారం ప్రస్తుతం పల్లెలకు కూడా పాకింది. ప్రధానంగా ఉదయగిరి, ఆత్మకూరు, కావలి, కందుకూరు తదితర నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో వీటి ప్రభావం అధికంగా ఉంది. కొంతమంది వ్యాపారులు రాత్రికిరాత్రే లేఅవుట్లు వేసి విక్రయాలు సాగిస్తున్నారు. కేవలం వ్యాపారులు, మధ్యవర్తుల మాయ మాటలు నమ్మిన ప్రజలు ప్లాట్లు కొనిమోసపోతున్నారు. మెట్ట మండలాలు అయిన వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి తదితర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ లేఅవుట్లు అధికంగా ఉన్నాయి. ఇదంతా ఒకవంతైతే నెల్లూరు- ప్రకాశం జిల్లా సరిహద్దు మండలమైన వరికుంటపాడులో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. జిల్లా కేంద్రానికి శివారు ప్రాంతం కావడంతో ఉన్నతాధి కారుల తనిఖీలు ఉండవనే ధీమాతో వ్యాపారులు, అధికారులు నిర్లక్ష్యవైఖరి అవలంభిస్తున్నారు. అంతేకాక మండలం మీదుగా 565, 167బీ జాతీయ రహదారులు వెళుతుండటం, భవిష్యత్తు రైలుమార్గం కూడా చేరువ అవుతుందనే ఆశకల్పిస్తూ వ్యాపారులు దందా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో విరువూరు, వేంపాడు, రామాపురం, వరికుంట పాడు, దర్మవరం, గువ్వాడి, జీ.కొండారెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల, భోగ్యంవారిపల్లి తదితర గ్రామాల్లో సుమారు 170 ఎకరాల్లో దాదాపు 3వేల వరకు ప్లాట్లు వేసి విక్రయాలు సాగిస్తున్నారు. పట్టణాలకు చేరువ కావచ్చనే ఆశతో ప్లాట్లు కొన్నప్పటికీ, తమ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు భవిష్యత్తుల్లో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాగా మరికొంతమంది వ్యాపారులు తమ స్థలాలకు అనుకొని ఉన్న ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించుకుని ప్లాట్లు వేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట వేయాలి.



జీ.కొండారెడ్డిపల్లిలో వేస్తున్న లేఅవుట్

## వికసిత్ భారత్‌పై వర్క్‌షాప్

నెల్లూరు(విద్య), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్కూలింగ్.. బిల్డింగ్ బ్లాక్స్ అనే అంశంపై జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు మాట్లాడుతూ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న లక్ష్యంతో అందరూ పనిచేస్తున్నార న్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించేందుకు, ఉత్తమ విద్యా ప్రమాణాలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని అమలు చేస్తామని తెలిపారు. అనంతరం పలు అంశాలపై చర్చించి, వాటి అమలుకు ఐదుమంది విద్యావేత్తలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఉప విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు, ప్రిన్సిపాళ్లు, హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు

## నులిపురుగుల సమస్యపై అవగాహన పెంచుకోవాలి

వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నులిపురుగుల వల్ల ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి సూచించారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా నెల్లూరులోని వైవీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కడుపులో నులిపురుగుల వల్ల రక్తహీనతకులోనై పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పౌష్టికాహార లోపం, బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వాంతులు, అతిసార వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇలాంటి వారిలో శారీరక, మానసిక ఎదుగుదల మందకొడిగా సాగుతుందన్నారు. ఈ కారణంగా విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టలేరన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు సార్లు డీవార్మింగ్ డే నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ యశ్వంత్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి హేనాసుజన్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న డీపీఎం రాజ్‌కుమార్, తదితరులు

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం

● డీపీఎం రాజ్‌కుమార్

కావలి రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులవాడకం లేని ప్రకృతి వ్యవసాయంతో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లిలో వై.మాధవరావుకు చెందిన బయోరిసోర్స్ సెంటర్‌లో మంగళవారం 5 జిల్లాల బయోరిసోర్స్ సెంటర్‌ల యజమానులకు ఈ నెల 14వ తేదీ వరకు జరగనున్న శిక్షణ తరగతులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోరిసోర్స్ సెంటర్‌ల విధులు, బాధ్యతలు వివరించారు. విత్తనాల కిట్ల తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నాణ్యమైన విత్తనాలు, కషాయాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే ఎగ్‌ఎమినో యాసిడ్, పంచగవ్యదశపర్ని, పచ్చిమిర్చి వెల్లుల్లి ద్రావణం, ఘనజీవామృతం తయారీ విధానాలను వివరించారు. అనంతరం పొలాల్లో పంటలు వేసే విధానం, ఫీల్డులో వేసిన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మునిరత్నం, ప్రకృతి వ్యవసాయ స్టేట్ రిసోర్స్‌పర్సన్ మన్మోహన్, ఏడీఏ నాగరాజు, నెల్లూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలు, గుంటూరు జిల్లాల బయోరిసోర్స్ సెంటర్‌ల యజమానులు, గ్రామ రైతులు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, మెంటార్ కళావతి, ప్రకృతి వ్యవసాయ శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

● ఎల్‌డీఎం మణిశేఖర్

కావలి రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ రికవరీ శాతాలను పెంచుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్.మణి శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం కావలి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన బ్యాంకర్లు, ప్రభుత్వశాఖల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పురోగతిని బ్యాంకుల వారీగా చర్చిం చారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన, ప్రధాన మంత్రి సుర క్షాయోజన పథకాలు 100 శాతం ఖాతాదారులకు చేరువ చెయ్యాలన్నారు. టాటా ఏఐహెచ్ ద్వారా చేపడుతున్న పంటల బీమా స్కీం ప్రతి రైతు సద్వినియోగ పర్చుకునేలా చూడాలన్నారు. అలాగే వెటర్నరీ డిపార్టు మెంట్ సర్టిపై చేసిన వారికి డెయిరీ రుణాలు విస్తృతంగా ఇవ్వాలని, రికవరీలో సమస్యలుంటే వెటర్నరీ డిపార్టుమెంట్ ద్వారా క్లియర్ చేసుకోవాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన మైక్రో క్రెడిట్ ప్లాన్ అనుసరించి రుణాలు మంజూరు చెయ్యాలని, అందుకు సంబంధించిన సమస్యలుంటే ఎప్పటికప్పుడు ఏపీఎం, సీసీలతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల జీవనోపాధి మెరుగుకు రుణాలు పెంచి ఇవ్వాలని గత సమావేశంలో కలెక్టర్ నిర్ధారించారని, వ్యవసాయానికే కాకుండా ఇతర జీవనోపాధులకు కూడా విరివిగా రుణాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం బాబు, కెనరాబ్యాంక్ కావలి-2 సీనియర్ మేనేజర్ సునీల్ కుమార్, ఎంపీడీవో కార్యాలయ ఏవో సంధ్యాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిశేఖర్



## గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వ్యవస్థ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథం జయంతిని మంగళవారం నెల్లూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థ ల్లో ఘనంగా నిర్వహించారు. దీనిని రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథ పాలకుల దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఆర్ రంగనాథం చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, గ్రంథ పాలకులు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కీర్తించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన గ్రంథపాలకుడు రవీంద్రరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జితేంద్ర, కృష్ణయ్య, మేరీ గ్రేస్, గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథపాలకుడిగా ఉద్యోగ విరమణ పొందిన రవీంద్రరెడ్డిని సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది

## ఎల్ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

● జేసీ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్ల యజమానులు, వాటిలో స్థలాలు కొనుగోలు చేసిన వారు ల్యాండ్ రెగ్యులరేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని జేసీ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరు కలెక్టరేట్‌లో మంగళవారం ఎల్ఆర్ ఎస్‌పై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది జూన్ ముందు వరకు వేసిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లను చట్టబద్ధం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప అపరాధ రుసుంతో ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా మంచి అవకాశం కల్పించిందన్నారు. త్వరలో అన్ని మండలాల్లో కూడా పర్యటించి ఈ స్కీంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. అక్టోబరు 24లోగా ఎల్ఆర్ఎస్‌కు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు. సందేహా లుంటే నెల్లూరులోని నుడా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ లేఅవుట్ల క్రమబద్ధీకరణ స్కీంపై మండలస్థాయిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ స్కీం గడువు దాటిన తర్వాత అనధికార లేఅవుట్లు ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఆ లేఅవుట్లకు విద్యుత్, రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఎటువంటి అనుమతులు రావని, ప్లాట్లు కూడా రిజిస్ట్రేషన్ కావని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, నుడా ప్లానింగ్ ఆఫీసర్ హిమబిందు, సెక్రటరీ అల్లంపాటి పెంచలరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీ కార్తీక్, పక్కన సబ్‌కలెక్టర్ హిమవంశీ

## యువ భారత నిర్మాణంలో

# భాగస్వాములు కావాలి

● వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత

వెంకటాచలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా పోటీపడి యువ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత పిలుపునిచ్చారు. వీఎస్‌యూలో మంగళవారం సెట్నెల్, నెహ్రూ యువకేంద్రం, వీఎస్‌యూ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. యువత మంచి మార్గం వైపు అడుగులు వేయాలని రిజిస్ట్రార్ సూచించారు. కార్యక్రమంలో సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, నెహ్రూ యువకేంద్రం అధికారి ఎం మహేంద్రరెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధికారి హరికృష్ణ, స్టూడెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ హనుమారెడ్డి, శ్రీనివాసులు, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పుట్టాలమ్మకు పొంగళ్లు

ఏఎస్ పేట, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లపాడు గ్రామ చెరువు సమీపంలోని పుట్టాలమ్మ గుడిలో మంగళవారం ఘనంగా పొంగళ్లు నిర్వహించారు.గ్రామంలో రాములవారి తిరుణాళ్ల ముగిసిన మరుసటిరోజు పుట్టాలమ్మ పొంగళ్లు నిర్వహించడం ఆనవాయితీ.ఈ సందర్భంగా మహిళలు తట్టబుట్టలతో గుడి వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కోర్కెలు నెరవేరాలని మొక్కుకున్నారు.

**బంగారం, వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ. 9574 |
| వెండి కిలో ధర | రూ. 116600 |
| వెండి ఒక గ్రాము | రూ. 119.60 |

**న్యూస్ బాక్స్**

### రోడ్డు నిర్మాణానికి నిధులు

కలువాయి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో దారుణంగా తయారైన పొదలకూరు-సోమశిల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 60లక్షలు మంజూరు చేసినట్లు ఆర్అండ్‌బీ ఏఈ అవినాష్ తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈ పనులకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో కాంట్రాక్టర్ పనులు మొదలు పెడతారని వివరించారు. రెండు కల్వర్టులతోపాటు కొంత భాగం సిమెంటు రోడ్డు, మరికొంతభాగం తారురోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. కాగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కూడా ఆర్అండ్‌బీ ఎస్ఈకి ఫోన్ చేసి పనులు త్వరగా చేపట్టాలని కోరారు.

### ఎస్ఆర్ రంగనాథన్ జయంతి

అనంతసాగరం ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయశాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించి, ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

### లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

సంగం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు సంబంధించిన పత్రాలతోపాటు లైసెన్సు లేకుండా నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేష్ వాహనదారులను హెచ్చరించారు. మంగళవారం ఆయన సంగం జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి తనిఖీ చేశారు. పలువురు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా, సరైన పత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

### మద్యం దుకాణాల తనిఖీ

సీతారామపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని రెండు మద్యం దుకాణాలను మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ కాలేషా ఆకస్మికంగా తనిఖీ చేశారు.మద్యం నిల్వలతోపాటు రికార్డులను పరిశీలించారు. షాపుల నిర్వహణలో సమయపాలన పాటిస్తూ , ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరపాలని, బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు

### సామూహిక కుంకుమార్చన

సంగం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో వెలసి ఉన్న పోలేరమ్మ ఆలయంలో శ్రావణమాసం మూడవ మంగళవారం సందర్భంగా సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు.

### ఖాతాదారులకు అవగాహన

వింజమూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న సురక్ష బీమా పథకాలు గురించి ఎస్‌బీఐలో మంగళవారం ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా డీజీఎం దినేష్ గూడియా, ఆర్ఎం బీఎస్ఎన్ స్వామి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసింహాల బీభత్సం

- ఉదయగిరిలో వీధికుక్కల బెడద
- దాడులతో ప్రజల భయాందోళన
- పట్టించుకోని అధికారులు

ఉదయగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధి కుక్కల దాడులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అవి చిన్నారులు, వృద్ధులు, మహిళలను గాయపరుస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. ఏవీధిలో చూసినా కుక్కలు గుంపులుగుంపులుగా సంచరిస్తుండడంతో పాఠశాలకు వెళ్లే చిన్నారులు, వాహనదారులు సైతం హడలిపోతున్నారు. ప్రధానంగా పోలీస్‌స్టేషన్ ఎదురుగా చికెన్ దుకాణాలు ఉండడం, ప్రధాన రహదారి కావడంతో నిత్యం గుంపులుగా సంచరిస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక్కోవీధిలో 15 నుంచి 20 కుక్కలు సంచరిస్తున్నాయి. ఇక రాత్రి సమయాల్లో చెప్పాల్సిన పని లేదు. ప్రజలు కర్రలు చేతపట్టుకుని వీధుల్లో తిరగాల్సిన దుస్థితి నెలకొంది. కుక్కల అరుపులతో రాత్రిళ్లు నిద్ర కూడా ఉండడంలేదని పలువురు వాపోతున్నారు. కొన్ని కుక్కలు ప్రజల చేతుల్లో ఉన్న కవర్లను సైతం లాగేస్తున్నాయి. ఇటీవల దేవలాలగడ్డకు చెందిన చిన్నారి పాఠశాలకు వెళుతుండగా కుక్క దాడి చేసి ముఖంపై గాయపర్చింది. ఇందిరానగర్ కాలనీలో మూడు గేదెలు, ముగ్గురు వ్యక్తులపై పిచ్చికుక్క దాడి చేయడంతో కాలనీవాసులు బెంబేలెత్తిపోయారు. ఇటీవల సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా ఆయా ప్రాంతాలకు వచ్చిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు సైతం ఆ బాలికను చూపించి కుక్కలను నివారించాలని విన్నవించారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించి నివారించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అయినా ఆదిశగా వారు చర్యలు చేపట్టిన దాఖల్లాలేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల దాడి నుంచి తమను కాపాడాలని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.


బాలిక ముఖంపై కుక్కకాటు గాయాలు(ఫైల్)


వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

# పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలి


ఆత్మకూరు : అంగన్‌వాడీ చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న డాక్టర్ షేక్ అస్మా


ఉదయగిరి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి శివకల్పన


వరికుంటపాడు : మాత్రలు మింగిస్తున్న ఎంపీడీవో గోపీశ్రీనివాస్

ఆత్మకూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ధనేకుల యశ్వంత్, ఆత్మకూరు అర్బన్ వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ షేక్ అస్మా తెలిపారు. నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం వారు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు మాత్రలను వేయించారు. ఈ కార్యక్రమాలలో ఇన్‌చార్జ్ ఎంఈవో అనంతలక్ష్మి, మెప్మా సీవో మాధవి, ఎంపీహెచ్ఈవో ఎస్ సుధాకర్, సోషల్ వర్కర్ రమణ, ల్యాబ్ టెక్నీషియన్ రహీం పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. తూర్పుబోయమడగల ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో గోపీశ్రీనివాస్ విద్యార్థులకు మాత్రలు మింగించారు. కార్యక్రమంలో హెచ్ఎం పీ రమేష్, సీహెచ్‌వో రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : మండలంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం 97.91 శాతం మంది విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు మింగించామని మండల వైద్యాధికారిణి శివకల్పన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రత, అనీమియాపై అవగాహన కల్పించి మాత్రలు మింగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, వైద్యఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● చేజర్ల : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేజర్ల, చిత్తలూరు పీహెచ్‌సీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు అన్నీ ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కళాశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులకు, చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.మెహతబ్, డా.అంశుధర్, డా.నవీన్, డా. నరసింహారావులతోపాటు ఆయా పీహెచ్‌సీల సిబ్బంది, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

● సంగం : పిల్లల్లో రక్తహీనత తగ్గుదలకు ఏడాది రెండు పర్యాయ్యాలు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని జిల్లా అదనపు వైద్యాధికారి, ఖాదర్‌వలి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు శ్రీనివాసులురెడ్డి, అశోక్, ప్రిన్సిపాల్ సుమతమ్మ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్నీ పాఠశాలల్లో నులిపురుగుల మాత్రలను విద్యార్థులకు మింగించారు.

● ఏఎస్‌పేట : చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడంతో పలు రోగాలు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా అదనపు వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు.మంగళవారం ఆయన హసనపురంలో నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో చిరమన పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతిరాణి,ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఖాదర్‌వలి

### నేటి ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయండి

ఉదయగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం అమలుకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం దుత్తలూరు తహసీల్దారు కార్యాలయం నుంచి ఉదయగిరి ఏఎంసీ కార్యాలయం వరకు చేపట్టే ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ర్యాలీలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొంటారని తెలిపారు.

### చేతిపంపునకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉదయగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దుర్గంపైగల జట్‌ఫట్‌టీబీ దర్గా ఆవరణలో ఉన్న చేతిపంపునకు మంగళవారం మరమ్మతులు చేపట్టి తాగునీరు వచ్చేలా చర్యలు చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'మరమ్మతులకు గురైన చేతిపంపు-అవస్థలు పడుతున్న పర్యాటకులు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించి ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లాలు బోర్ మెకానిక్‌తో మరమ్మతులు చేపట్టి తాగునీటి ఇబ్బందులను తొలగించారు.

### రహదారి నిర్మాణానికి పరిశీలన

ఉదయగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి దుర్గంపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నుంచి మెట్ల మార్గం వరకు ఏర్పాటు చేయనున్న రహదారి నిర్మాణానికి మంగళవారం అధికారుల బృందం పరిశీలన చేసింది. ప్రభుత్వం నిధులు కేటాయించడంతో రెవెన్యూ, అటవీ, ఆర్కియాలజీ, సర్వే శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు రామ్మోహన్, అటవీ శాఖాధికారి బీఎస్ కుమారరాజా మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి సంబంధించి సంయుక్త పరిశీలన చేసి నివేదిక సిద్ధం చేశామన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. అనుమతులు రాగానే పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ జేఈ ఫయాజ్, సర్వేయర్లు, వీఆర్వోలు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### బస్సుల కండీషన్ మెరుగుకు చర్యలు

ఉదయగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రజారవాణా సంస్థ బస్సుల కండీషన్ మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ సీటీఎం రమేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న దృష్ట్యా డిపోను సందర్శించి బస్సుల కండీషన్‌ను పరిశీలించామన్నారు. డ్రైవర్, కండక్టర్ల సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఏఎంఎఫ్ నాగరత్నం, సూపర్‌వైజర్ రమణయ్య, డీసీ హజరత్తయ్య, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల కమిటీల ఏర్పాటు

సంగం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లు భీమేశ్వరాలయం, మర్రిపాడు చెన్నకేశస్వామి ఆలయాలకు నూతన కమిటీలను దేవదాయశాఖ మంగళవారం ప్రకటించింది. వంగల్లు భీమేశ్వరాలయానికి పగడాల రఘురామయ్యను చైర్మన్‌గా, మరో తొమ్మిది మందిని కమిటీ సభ్యులుగా నియమించింది. చెన్నకేశవ ఆలయానికి ఎం. శ్రీహరిరెడ్డిని చైర్మన్‌గా మరో పదిమందిని కమిటీ సభ్యులుగా నియమించింది. దీంతో వారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఈ-పంట నమోదు తప్పనిసరి

ఉదయగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పంట సాగు చేసిన ప్రతీ రైతు తప్పనిసరిగా రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి, ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం మండలంలోని శకునాలపల్లి, కృష్ణంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

# ప్రజలపై భారం మోపడం సరికాదు : సీపీఎం


విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలపై భారం మోపడం సరికాదంటూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌వద్ద నిరసన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలను తక్షణమే ఆపాలని, పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాలని, అదనపు భారాలను రద్దు చేయాలనే నినాదాలతో హోరెత్తించారు. అనంతరం సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే ట్రూఅప్ జార్జీల పేరుతో విద్యుత్ యాజమాన్యాలు దోచుకుంటున్నాయని, నూతనంగా స్మార్ట్ మీటర్లుతో మరింత ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు జీ. శివప్రసాద్, కే. డేవిడ్‌రాజు, ఆత్మకూరు నాగయ్య, షేక్ సందాని, వీ శ్రీహరి, గుల్జార్‌బేగం పాల్గొన్నారు.

# స్టేడియం స్థలం పరిశీలన


స్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఉదయగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గండిపాళెం మార్గంలో గతంలో స్టేడియం ఏర్పాటుకు మంజూరు చేసిన స్థలాన్ని మంగళవారం జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ అధికారులు పరిశీలించారు. ఈ సందరర్భంగా డీఎస్‌డీవో యతిరాజ్ మాట్లాడుతూ సర్వేనెంబర్ 482/2ఏ, 483/2బీలలోని 2.75 ఎకరాల స్థలాన్ని స్టేడియానికి కేటాయించారన్నారు. కావలి నుంచి సీతారామపురం వరకు 167-బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో తమ స్థలం కొంత భాగం పోగా పరిహారం సైతం అందజేశారన్నారు. కాగా 2.90 ఎకరాల స్థలం మిగిలి ఉందన్నారు. ఆ స్థలాన్ని పరిశీలించి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఈ స్థలంలో సౌకర్యవంతంగా క్రీడా వికాస కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ పరిశీనలో రెవెన్యూ, స్పోర్ట్స్ ఆథారిటీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జేఏసీ కమిటీల ఎంపిక

ఏఎస్‌పేట,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి):దళిత,గిరిజన, మైనార్టీ జేఏసీ నూతన కమిటీల ఎంపికను మంగళవారం ఏఎస్ పేటలో రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత,గిరిజన,మైనార్టీ హక్కుల సాధన కోసం గ్రామ స్థాయి నుంచి పోరాటం చేయడానికి కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా షేక్ రఫీ,మండల అధ్యక్షుడిగా ఖాజాహుసేన్,కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సముద్రాల దావీద్,మహిళా విభాగం అధ్యక్షురాలు చల్లా మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

● ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి


సంగం : ఆర్టీసీ బస్టాండ్ స్థలం పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి తదితరులు

సంగం/ వింజమూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సంగం, వింజమూరులో ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. స్థలంపై స్థానిక నాయకులు, గ్రామస్థులతో చర్చించారు. అనంతరం తహసీల్దారు సోమ్లా నాయక్‌ను కలిసి స్థలం వివరాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ అటు కడప, కర్నూలు, పామూరు, కనిగిరి, ఇటు నెల్లూరు, పొదలకూరు, చేజర్ల ప్రాంతాలకు జంక్షన్‌గా ఉన్న సంగంలో ఆర్టీసీ బస్టాండ్ అవసరమన్నారు. త్వరలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చించి బస్టాండ్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఆత్మకూరు డిపో మేనేజర్ శివకేశవ్ యాదవ్, ఏఈ సుభాషణం, సంగం పీఏసీఎస్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, టీడీపీ నాయకులు మాఘం గిరిబాబు, బీజేపీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

### అంగన్‌వాడీల ఆందోళన

ఉదయగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కోడె రమణయ్య, రజియా మాట్లాడుతూ గతంలో కార్యకర్తలకు ఇచ్చిన సెల్‌ఫోన్‌లు సక్రమంగా పని చేయకపోవడంతో తమతోపాటు లబ్ధిదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత ఫోన్‌ల స్థానంలో కొత్త ఫోన్లను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సెల్‌ఫోన్‌లను కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఉదయగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గవర్నర్‌పేట-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులు సంస్థకు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలన్నారు.

**C.R.I.M.E N.E.W.S**

### గుళికలు తిని గిరిజన యువకుడి మృతి

కావలిరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో గుళికలు తిని గిరిజన యువకుడు సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఆముదాలదిన్నె ఎస్టీకాలనీకి చెందిన గడ్డం రామయ్య(19) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం పూటుగా మద్యం తాగి ఆ మత్తులో కొంగల వేట కోసం ఇంట్లో తెచ్చిపెట్టిన గుళికలు తిని అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు మంగళవారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. కాగా ఆముదాలదిన్నెకు చెందిన టీడీపీ నాయకుడు ఉప్పాల దినేష్ గిరిజన కుటుంబానికి అండగా నిలిచి మృతదేహాన్ని అంబులెన్స్‌లో గ్రామానికి తరలించడంతోపాటు అంత్యక్రియలు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నాడు.

### యువతి అదృశ్యంపై ఫిర్యాదు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండకిందపల్లి కంకర క్వారీ వద్ద పని చేస్తున్న ఓ యువతి అదృశ్యమైన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కంకర క్వారీ వద్ద మధ్యప్రదేశ్‌కి చెందిన కుటుంబాలు పని చేస్తున్నాయి. ఈ క్రమంలో ఆ యువతి కూడా తల్లితో కలిసి అక్కడే పని చేస్తూ ఉండేది. ఆ యువతి, ఇద్దరు యువకులు సోమ వారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఆదిలక్ష్మి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

### యువకుడి బలవన్మరణం


కిషోర్ (ఫైల్)

రాపూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిద్ధలయ్య సెంటర్‌కు చెందిన బక్కి కిషోర్ (25) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకోగా, చుట్టుపక్కల వారు గమనించి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ వెంకటరాజేష్ తెలిపారు.

### ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ అనుమానాస్పద మృతి


సీటులోనే కుప్పకూలి మృతి చెందిన శ్రీనివాసులు

రాపూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులిగిలపాడు వద్ద ఉన్న ఎస్ఎల్వీ స్టోన్ క్రషర్‌లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పులిగిలపాడుకి చెందిన గుర్రం శ్రీనివాసులు (35) అనుమానాస్పదంగా మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఎక్స్‌కవేటర్ ఆపరేట్ చేస్తుండగా గుండెపోటుతో సీటులోనే కుప్పకూలి మృతి చెందాడని అక్కడి అధికారులు మృతుడి బంధువులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ యువకుడు...

ముత్తుకూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఈనెల 2వ తేదీన నెల్లూరు రహదారిపై ముత్తుకూరు మద్దిమాను సెంటర్‌లో వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైకును ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, చలివేంద్రకు చెందిన శ్రీరాములు హర్షవర్ధన్ (18) తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరులోని ప్రైవేటు వైద్యశాలలో పది రోజులుగా చికిత్స పొందుతున్న హర్షవర్ధన్ మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

### డీటీతో వాగ్వాదం.. వ్యక్తిపై ఫిర్యాదు

మనుబోలు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జట్లకొండూరుకు చెందిన చీకటి సుధాకర్ అనే వ్యక్తిపై రెవెన్యూ సిబ్బంది మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్న సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌తో వాగ్వాదానికి దిగాడు. పెద్దగా కేకలు వేస్తూ, ఫైల్స్ విసిరి గొట్టి, దురుసుగా ప్రవర్తించాడు. డీటీ ముందున్న బెంచీని తోసే ప్రయత్నం చేసి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో చీకటి సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలని 9మంది రెవెన్యూ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### లైంగికదాడిపై అట్రాసిటీ డీఎస్పీ విచారణ

సంగం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ గిరిజన మహిళపై జరిగిన లైంగిక దాడి ఘటనపై నమోదైన కేసులో మంగళవారం అట్రాసిటీ డీఎస్పీ జీ శ్రీనివాసులు విచారణ చేశారు. ఈ నెల 3న మామిడి తోటలో కాపలా ఉన్న గిరిజన మహిళపై అదే తోట యజమాని లైంగికదాడికి పాల్పడడంతో కేసు నమోదైన విషయం విదితమే. ఈ కేసుపై ఇప్పటికే స్థానిక డీఎస్పీ విచారించారు. అయితే లైంగిక దాడికి గురైన మహిళ గిరిజన మహిళ కావడంతో అట్రాసిటీ డీఎస్పీ శ్రీనివాసులు సంఘటన స్థలానికి వెళ్లి బాధితురాలిని, సాక్ష్యులను విచారించారు. ఆయన వెంట సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ ఉన్నారు.

### మరో కేసులో కాకాణికి బెయిల్

నెల్లూరు (లీగల్),ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ భూముల స్వాహా కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు నగర మొదటి తరగతి రెండవ అదనపు న్యాయాధికారియల్ శారదారెడ్డి మంగళవారం ఉత్తర్వు చేశారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో మోసం, దగా కుట్రలతో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి రికార్డులను తారుమారు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారన్న కేసులో కాకాణి 14వ నిందితుడిగా ఉన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్నాక కాకాణికి బెయిల్ మంజూరు చేస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

### అలంకారప్రాయంగా టీవీలు


ఎంపీడీవో కార్యాలయంలో వినియోగంలో లేని టీవీ

పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన టీవీలు వినియోగంలో లేకుండా పోయాయి. కేవలం అలం కారప్రాయంగానే మిగిలాయి. వరికుంటపాడు తహసీల్దారు కార్యాలయంలోని టీవీ ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. అలాగే మండల పరిషత్ కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి. ప్రస్తుతం శాఖల పరంగా ప్రతీ అంశాన్ని సైతం వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా అధికారులు సమగ్రంగా సమీక్షిస్తున్నారు. ఆ సమయంలో ఉద్యోగులు తప్పనిసరిగా టీవీ ఎదుట హాజరు కావాల్సి ఉంది. టీవీ పనిచేయలేదనే సాకుతో కొంతమంది కార్యాలయాల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ టీవీలను వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.

-వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి)

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 118 |
| స్కిన్ చికెన్ | 216 |
| స్కిన్‌లెస్ | 240 |
| కోడిగుడ్ల ధర (100): 520 | |

## నేటి శోభాయాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయండి

అల్లూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే శోభాయాత్ర, బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కన్వీనర్ చెంతాటి కృష్ణమోహన్ అన్నారు. అల్లూరులో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేపట్టిన రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం నెల్లూరుకు రానున్నారన్నారు. ఉదయం 10 గంటలకు వీఆర్‌సీ సెంటర్ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు శోభాయాత్ర నిర్వహించిన అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. మండలం నుంచి వందలాదిగా కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆవల గోవిందస్వామి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి సున్నపుగుంట గోవిందరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షుడు ఇండ్ల మమత, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఉండ్రాళ్ల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

# బిట్రగుంట రైల్వే అభివృద్ధికి అడుగులు!



పూర్తి కావచ్చిన ఏఆర్టీ, ఆర్వీఎంల సర్వీస్ పాయింట్ నిర్మాణం

- రోడ్ల పునర్నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు
- ఫుట్, ఫ్లై ఓవర్ బ్రిడ్జీల కోసం డైవర్షన్ రోడ్లు
- ఏఆర్టీ, ఆర్వీఎంల మరమ్మతుల పాయింట్ నిర్మాణం

బిట్రగుంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : బిట్రగుంటలో రైల్వే అభివృద్ధి పనులు జోరుగా సాగుతోన్నాయి. రోడ్ల పునర్నిర్మాణం, వీధి దీపాల మార్పు, ఫుట్, ఫ్లై ఓవర్ బ్రిడ్జిల కోసం డైవర్షన్ రోడ్ల నిర్మాణం, ఏఆర్టీ, ఆర్వీఎంల మరమ్మతుల పాయింట్ ఏర్పాటు పనులు చేపట్టారు. దీంతో ఈ ప్రాంతానికి మళ్లీ పూర్వవైభవం వస్తుందని స్థానికులు భావిస్తున్నారు. బిట్రగుంటలో 18 వందల ఎకరాలకు పైగా రైల్వే భూములు ఉన్నాయి. ఈ భూముల్లో గతంలో ఉన్న రైల్వేలోని పలు విభాగాలకు చెందిన కార్యాలయాలు తరలిపోయాయి. ప్రస్తుతం కొంత మేరకు కార్యాలయాలు, రైల్వేస్టేషన్, రైలు పట్టాల ప్రదేశాలు పోను దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా భూములు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ భూముల్లో ఇటీవల పలు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.

**● వేగంగా ఏఆర్టీ, ఆర్వీఎం పాయింట్ నిర్మాణం**

రైలు ప్రమాదాలకు గురైనప్పుడు వాటిమరమ్మతుల కోసం ఏఆర్టీ (యాక్సిడెంట్ రిలీఫ్ ట్రయిన్), ఆర్వీఎం (యాక్సిడెంట్ వ్యాన్ మెడికల్) రైలు బోగీల సర్వీస్, మరమ్మతుల పాయింట్ నిర్మాణం చేపట్టారు. దాని పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇప్పటి వరకు ఒంగోలు నుంచి గూడూరు మధ్య జరిగే రైల్వే ప్రమాద స్థలానికి రిస్క్ టీం వెళ్లి మరమ్మతులు చేపట్టేవారు. బోగీల మరమ్మతులు, సర్వీసులు విజయవాడ డివిజనల్ హెడ్‌కోర్టర్‌కు తరలించే పరిస్థితి ఉంది. ప్రస్తుతం బిట్రగుంటలో జరుగుతున్న పనులు పూర్తయితే బోగీల మరమ్మతులు, సర్వీసు పనులు బిట్రగుంటలోనే చేసే అవకాశం కలుగుతోంది. అటువంటి పాయింట్ బిట్రగుంట స్టేషన్‌కు ఉత్తరాన ఏర్పాటు చేయడం అభివృద్ధికి తొలి అడుగని స్థానికులు భావిస్తున్నారు. అలాగే 2028 నాటికి ఎల్సీ గేట్లు ఎత్తి వేయాలని రైల్వేశాఖ ప్రతిపాదనలు చేసింది. అందులో భాగంగా బోగోలు మండల పరిధిలోని కొండబిట్రగుంట, బోగోలు ఎల్సీ గేట్ల వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తి కావాలని రైల్వే శాఖ మూడేళ్ల క్రితమే ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా డివైడింగ్ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నారు.

**● జోరుగా రోడ్ల పునర్నిర్మాణ పనులు**

ఏళ్ల తరబడి దెబ్బతిన్న బిట్రగుంట రైల్వే స్టేషన్ నుంచి కొత్తూరు పాత సిక్‌లైన్ వరకు ప్రధాన రోడ్డుపై ప్రయాణికులకు ఇబ్బందిపడేవారు. అలాగే రైల్వే స్టేషన్ నుంచి డ్రైవర్సు గార్డుల విశ్రాంతి భవనం, బోగోలు బజారు వరకు ఉన్న రైల్వే రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. ఈ మార్గంలో ఇటీవల కాలంలో దాదాపు కిలోమీటర్‌కు పైగా తారురోడ్ల నిర్మాణం జరిగింది.



జోరుగా సాగుతున్న తారు రోడ్డు నిర్మాణ పనులు

రైల్వే స్టేషన్‌కు తూర్పు వైపు గతంలో ఉన్న రోడ్డు ఇటీవల పునఃనిర్మాణ పనులు జరిగాయి. అలాగే రైల్వే స్టేషన్ నుంచి రన్నింగ్ రూమ్ వరకు ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. డ్రైవర్లు, గార్డుల విశ్రాంతి భవనం సమీపంలో నూతన భవన నిర్మాణం జరుగుతోంది. అయితే బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, విశ్రాంత రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు, రైల్వే ఉద్యోగులు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కోసం చేసిన విజ్ఞప్తులకు, పార్లమెంటు సమావేశాల్లో గతంలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు యాదవ్, గతంలో అప్పటి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు బిట్రగుంట రైల్వే ప్రాంత అభివృద్ధిపై ప్రస్తావించడంతో రైల్వే ఉన్నతాధికారులు స్పందించారని పలువురు అంటున్నారు. అలాగే బోగోలు ఎల్సీగేట్ 143 వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఇచ్చిన హామీలో భాగంగా బోగోలు నుంచి కొండబిట్రగుంట రైల్వే గేట్ వైపు తారు రోడ్డు వేస్తున్నారన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

## ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేద్దాం




కలిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కలిగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసుకుందామని తహసీల్దారు గిరీష్ ప్రజలకు పిలునిచ్చారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా వెబ్‌సైట్‌లో ఎన్‌రోల్ చేసుకుంటే డీఏ వలంటీరుగా వ్యవహరించ వచ్చని సూచించారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలో విద్యార్థులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు.

## అట్టహాసంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం

కావలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీబీఎస్, విట్స్ ఇంజనీరింగ్ కళాశాలల్లో మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో దామివెట్టి సుధీర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీవీ రావు, పరిపాలనాశాఖ అధికారి రమేష్‌బాబు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ రమణయ్యలు అంతర్జాతీయ యువజన దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. సామాజిక సేవలో, సమస్యల పరిష్కారంలో యువత భాగస్వాములు కావాలని చెప్పారు. ఈ మేరకు కట్టుబడి ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మధుకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జేబీ కళాశాల సీనియర్ లైబ్రియన్ డాక్టర్ డీ.వెంకట్రావు, విట్స్ కళాశాల లైబ్రరియన్ డాక్టర్ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏల మండల కమిటీ ఎన్నిక

ఉలవపాడు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండల వీఆర్‌ఏల నూతన కార్యవర్గ కమిటీని మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఏల జిల్లా సహాయ కార్యదర్శి బాలు అధ్యక్షతన జరిగిన సమావేంలో ఎన్నుకున్నారు. కమిటీ గౌరవఅధ్యక్షుడుగా దాసరి బ్రహ్మయ్య, అధ్యక్షుడుగా చిరితోటి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా నాలం సుబ్బారావు, కోశాధికారిగా దాసరి హరిబాబు, సహాయ కార్యదర్శిగా నన్నం కొండలరావులను ఎన్నుకున్నారు.

## 152 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 209 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 152 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-47, సీఆర్-5, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 57బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.140, సగటు ధర రూ.192.44గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

## బాలుడిపై వానరం దాడి

బిట్రగుంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ పడమర ఐఓడబ్ల్యూ, పీడబ్ల్యూఐ కార్యాయల మధ్యలో మంగళవారం ఇబ్రహీంపేటకు చెందిన ఓ బాలుడుపై వానరం (కోతి) దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. రైల్వే బ్రిడ్జి దిగి వెళుతున్న బాలుడిని కోతి వెంబడించింది. బాలుడు బయపడి పరుగు తియ్యడంతో దాడికి దిగింది. సమీపంలో ఉన్న రైల్వే కాంట్రాక్ట్ కూలీలు ఆ బాలుడిని కాపాడారు.

## పంటల సాగులో మెలకువలు పాటించాలి



వలేటివారిపాలెం : కళవళ్లలో కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో శేషారెడ్డి

వలేటివారిపాలెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి శేషారెడ్డి తెలిపారు. మండలంలోని కళవళ్ల, నలదలపూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేసుకోవాలని తెలపారు. ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకే ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బీ.సాయిచరణ్, రైతులు పాల్గొన్నారు.

**● లింగసముద్రం :** సజ్జ పైరులో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి హర్షవర్ధన్ రైతులకు చెప్పారు.మంగళవారం మండలంలోని తిమ్మారెడ్డిపాలెం పొలాల్లో, లింగసముద్రంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు దీప, రేణుక, మార్కెటింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# విగ్రహావిష్కరణలో ఫ్లెక్సీల గొడవ

- తమ నాయకుడి ఫొటో లేదని ఎమ్మెల్యే ఫ్లెక్సీని ట్రాక్టర్‌తో తొక్కించిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి ఫొటోలు, వీడియో



కింద పడేసిన ఫ్లెక్సీ

కలిగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీలో నెలకొన్న వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. అందుకు నిదర్శనం ఈనెల 3వ తేదీన మండలంలోని ఎరుకలరెడ్డిపాలెంలో జరిగిన ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ సందర్భంగా ఎమ్మెల్యే ఫ్లెక్సీని ధ్వంసం చేసి ట్రాక్టర్‌తో తొక్కించడమే. ఫ్లెక్సీలో తమ నాయకుడు ఫొటోలు లేవంటూ ఆ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మద్యం మత్తులో ఈ ఘటనకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి రావడం నియోజకవర్గంలో సంచలనం రేకెత్తించింది. వివరాల మేరకు ఎరుకలరెడ్డిపాలెంకు చెందిన ఖాజా మస్తాన్ చెన్నైలో ఆర్థికంగా స్థిరపడి ఇటీవల గ్రామంలో వాటర్‌ప్లాంట్ నిర్మాణం, ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన విగ్రహావిష్కరణకు సంబంధించి రెండవ తేది రాత్రి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా టీడీపీలో మరో వర్గానికి చెందిన వ్యక్తి మద్యం సేవించి వచ్చి తమ నాయకుడు ఫొటో ఫ్లెక్సీలపై లేకపోవడంపై ఖాజామస్తాన్‌ను ప్రశ్నించాడు. దేవుడి కార్యక్రమం సందర్భంగా విగ్రహ నిర్మాణానికి చేయూతనిచ్చి వారి ఫొటోలు మాత్రమే ఫ్లెక్సీలో వేయించామని అతను చెప్పాడు. అందుకు ఆగ్రహించిన ఆ వ్యక్తి ట్రాక్టర్‌ను తీసుకొచ్చి ఫ్లెక్సీలను తొక్కించాడు. ఈ విషయమై కలిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఖాజామస్తాన్ ఫిర్యాదు చేయగా ఫ్లెక్సీలను తొక్కించిన వ్యక్తి టీడీపీ కార్యకర్త కావడంతోపాటు మద్యం సేవించి ఉన్నాడనే కారణంతో గ్రామస్థులు ఫిర్యాదు వెనక్కు తీసుకున్నారు. 3వతేది ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విగ్రహావిష్కరణ సమయంలో ఎటువంటి వివాదాలు జరగక పోవడంతో కార్యక్రమం సుజావుగా జరిగింది. ఘటన జరిగిన 10రోజుల తర్వాత ఎమ్మెల్యే ఫ్లెక్సీ ధ్వంసానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మండలంలో తీవ్ర చర్చనీయాంశం అయ్యింది.

# అభివృద్ధిని అడ్డుకోవాలనుకోవడం మూర్ఖత్వం

- చెత్త రీ సైక్లింగ్ ప్రక్రియను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి



చెత్త రీ సైక్లింగ్ ప్రక్రియను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని అడ్డుకోవాలనుకోవడం మూర్ఖత్వం అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని గుర్రంవారిపాలెం సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు నుంచి చెత్త, ఘనవ్యర్థాల శుద్ధీకరణ (బయోమైనింగ్) ప్రక్రియను మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా పట్టణ ప్రజలు డంపింగ్ యార్డు కారణంగా కాలుష్యంతో పడుతున్న ఇబ్బందికి శాశ్వత పరిష్కారం చూపిస్తానని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చెత్తను పూర్తిగా తరలించే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం డంపింగ్‌యార్డు సమస్య గురించి అసలు పట్టించుకోలేదని, ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నా వారికి జాలికలగలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు వచ్చినప్పుడు కూడా ఇదేసమస్యపై హామీ ఇచ్చారని అందులో భాగంగా నేడు పనులు ప్రారంభమయ్యాయన్నారు. రాష్ట్రంలోని 120 మున్సిపాలిటీలలో 40 మున్సిపాలిటీలలో మాత్రమే ఈ కార్యక్రమం చేపట్టగా అందులో కందుకూరు ఉండేలా కృషి జరిగిందని వివరించారు. ఎవరెన్ని అవాంతరాలు సృష్టించినా కందుకూరు పట్టణంలో అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తిలేదని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కాలం చెల్లిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.అనూష, డీఈఈ గణపతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# 98 శాతం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



కొండాపురం : విద్యార్థినికి ట్యాబ్లెట్లు మింగిస్తున్న వైద్యాధికారి నసీరుద్దీన్

కొండాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలో 98 శాతం మందికి ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ పూర్తయినట్లు వైద్యాధికారి నసీరుద్దీన్ తెలిపారు. 18 ఏళ్ల లోపు వారిని 5433 మందిని గుర్తించగా 5331 మందికి ట్యాబ్లెట్లు ఇచ్చామన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**● జలదంకి(ఆంధ్రజ్యోతి):** మండలంలో 18 ఏళ్ల లోపు పిల్లలకు అల్బెండజోల్ మందులు పంపిణీ చేశారు. స్థానిక శ్రీసాయి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బత్తిన అయ్యలరెడ్డి, అకడమిక్ ఇంచార్జ్ నజీర్, ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

**● ఉలవపాడు(ఆంధ్రజ్యోతి) :** కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజి, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 5372 మందికి నులిపురుగు మాత్రలు మింగించినట్లు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా చాకిచర్ల పీహెచ్‌సీ పరిధిలో 3650 మందికి అల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు డాక్టర్ ప్రణూత చెప్పారు. ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి బీ సురేష్ పాల్గొన్నారు.

**విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**

**● కలిగిరి(ఆంధ్రజ్యోతి):** నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. మండలంలో మొత్తం 6906 మంది పిల్లలకుగాను 6561మందికి మాత్రలను మించించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వెంకటలక్ష్మి, సీహెచ్‌వో సాయిలక్ష్మి, వైద్య సిబ్బంది ప్రఖ్యాతి, పద్మ, నారాయణరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**● లింగసముద్రం(ఆంధ్రజ్యోతి):** మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 94 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు లింగసముద్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌సీ జీ.శ్రీనివాసులు చెప్పారు. మండలంలోని 45 అంగన్వాడీ కేంద్రాలు, 51 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 5824 ఉండగా 5498 విద్యార్థులకు మాత్రలు మింగించినట్టు చెప్పారు. మిగిలిన వారికి ఈనెల 20వ తేదీన మాత్రలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఉలవపాడు : చిన్నారులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్



లింగసముద్రం : విద్యార్థినులకు మాత్రలు మింగిస్తున్న సీహెచ్‌వో శ్రీనివాసులు



కలిగిరి : విద్యార్థినికి మాత్రలు మింగిస్తున్న డాక్టర్ గీతారెడ్డి

## అధికారులు సమన్వయంతో పని చేయాలి


కందుకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఇంటూరి సుశీల అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయలేమితో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం ద్వారా ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు జారీచేయటంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమావేశానికి వీఆర్‌ఓలు గైర్హాజరుకావటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి మెమోలు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ తొట్టెంపూడి అనసూయ, ఎంపీడీవో రత్నావళి, తహసీల్దారు లావణ్య, ఏవో అబ్దుల్‌రహీం, తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థినికి అభినందన**

పట్టణంలోని ఆదిఆంధ్రకాలనీకి చెందిన సూరపోగు డెలీషియా డాక్టరు బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్యా పథకానికి ఎంపికవగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం అభినందించారు. డెలీషియా తల్లిదండ్రులు సంతోష్‌కుమార్, లావణ్యలు స్థానిక టీడీపీ నాయకులుతో కలిసి స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యేను కలువగా ఆయన డెలీషియాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చదలవాడ కొండయ్య, ఉచ్చులూరి నిరంజన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## లిక్కర్ స్కాంలో ఇంకా పెద్ద తలలు ఉన్నాయి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్డీ విల్సన్



మాట్లాడుతున్న బీజేపీ నేత ఆర్డీ విల్సన్

కావలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కాంలో ఇంకా పెద్ద తలకాయలు ఉన్నాయని, వారినెవరినీ వదిలే ప్రసక్తి లేదని, అందరిపై చర్యలు ఉంటాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్డీ విల్సన్ తెలిపారు. కావలి బీజేపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కాంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పందించారని చెప్పారు. లిక్కర్ సమస్యతో పాటు రాష్ట్రంలోని పలు సమస్యల పరిష్కారం కోసం ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించారన్నారు. బుధవారం నెల్లూరుకు వస్తున్న రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనలో బీజేపీ శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా, మండల నాయకత్వం ప్రతి సోమవారం అధికారులతో మాట్లాడి స్థానిక సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా నాయకులు కలెక్టర్‌ను కలిసి సమస్యలను నివేదించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచిస్తున్నారన్నారు. పదవుల కోసం పాకులాడాల్సిన పనిలేదని, కష్టపడి పనిచేసే వారి దగ్గరకే పదవులు వస్తాయని చెప్పారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ దగదర్తి విమానాశ్రయ నిర్మాణం, కరేడు భూముల సమస్యలు, రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు పరిహారం వంటి అంశాలపై రాష్ట్ర అధ్యక్షుడితో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి బెల్లం కొండ మాల్యాద్రి, పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ కుమార్, నేతలు భాస్కర్, కంచర్ల మురళీకృష్ణ, కే.బ్రహ్మానందం, పరుసు వెంకటేశ్వర్లు, వింతా రంగారెడ్డి, పూనూరు మాధవి, అమరా వెంకటసుబ్బారావు, తిరుపతయ్య పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌కు యూరియా కేటాయించండి

- డీఏవోకి చైర్మన్, టీడీపీ నాయకుల వినతి



డీఏవోతో సమావేశమైన జలదంకి పీఏసీఎస్ చైర్మన్, టీడీపీ నాయకులు

జలదంకి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండో పంటగా వరిసాగు చేపట్టినందున రైతులకు అవసరమైన యూరియా జలదంకి పీఏసీఎస్‌కు కేటాయించాలని చైర్మన్ కరియావుల అప్పలనాయుడు, టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం నెల్లూరులో జిల్లా వ్యవసాయ శాఖాధికారి సత్యవాణిని కలసి వినతిపత్రం అందజేశారు. మండలంలో రైతులు యూరియా కొరతతో పడుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. ఈ విషయాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సూచనల మేరకు మిమ్మల్ని కలిశామని తెలిపారు. స్పందించిన ఆమె జలదంకి పీఏసీఎస్‌కు యూరియా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ముచ్చాల మధుసూదనరెడ్డి, షేక్ జానీ, టీడీపీ నేతలు మధురెడ్డి, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వినోద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా డేకేర్ సెంటర్‌లో ఉచిత వైద్య సేవలు అందిస్తాం



చిన్నారులకు పౌష్టికాహారం అందచేస్తున్న డాక్టర్ జ్యోతి ప్రకాష్‌రెడ్డి

కావలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న తలసేమియా డేకేర్ సెంటర్‌లో ఉచితంగా వైద్యసేవలు అందిస్తానని విజయవాడలోని రమేష్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ పీడియాట్రిక్, కార్డియాలజిస్ట్ డాక్టర్ జ్యోతి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. నిర్వాహకులు ఆయన చేతుల మీదుగా బాధిత చిన్నారులకు మందులు, పౌష్టికాహారం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన మిత్రుడు తలసేమియా డేకేర్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పామూరు శ్రీధర్ ఆహ్వానం మేరకు ఈ కేంద్రాన్ని సందర్శించానన్నారు. కావలి లాంటి చిన్న పట్టణంలో ఎంతో వ్యయప్రయాసల కోర్చి తలసేమియా బాధిత చిన్నారులకు సేవలందించడం అద్భుతమన్నారు. ప్రతినెల మొదటి మంగళవారం కావలికి వచ్చి తలసేమియా బాధిత చిన్నారులకు ఉచితంగా గుండెకు సంబంధించిన ఎకో పరీక్షలు నిర్వహిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవి ప్రకాష్, వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి, వైద్యాధికారి పామూరు శ్రీధర్, రక్త కేంద్రం కన్వీనర్ టీ.రమ్య, సభ్యులు కల్లయ్య, కొండారెడ్డి పాల్గొన్నారు.

## పారా అథ్లెటిక్స్‌లో చైతన్య కృష్ణకు రజితం



పారా అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయి రజిత పతకం సాధించిన చైతన్య కృష్ణ

ఉలవపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఈనెల 9, 10వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన పారా అథ్లెటిక్స్ షాట్‌పుట్ పోటీల్లో చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి చైతన్యకృష్ణ రజిత పతకం సాధించాడు. ఆ విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు కే.జనార్దన్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఒగుబోయిన శ్రీనివాసులు, జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.యాదగిరి, సెక్రటరీ మాల్యాద్రినాయుడు, విద్యాకమిటీ చైర్మన్ సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మంగళవారం అభినందించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 13 ఆగస్టు 2025





[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

# పాత జెండా మారుస్తున్నారు

'చిరిగిన జెండాకి వందన మెలా?' అంటూ తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీపంలో సుబ్బలక్ష్మి విగ్రహం కూడలిలోని భారీ జాతీయ జెండా చిరిగి పేలికలవడాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించింది. దీంతో మంగళవారం పాత జెండాను తొలగించారు. దీని స్థానంలో కొత్త జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయనున్నారు.

## హ్యాపీ ఎలిఫెంట్స్ డే



### గజరాజ ఆశీర్వాదం

ఏనుగుల దినోత్సవం సందర్భంగా సినీనటి, మిస్ ఇండియా-2020 విజేత మానస వారణాశి మంగళవారం ఉదయం తిరుమల గోశాలకు చేరుకున్నారు. ఏనుగుల ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకుముందు ఆమె వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే, మిస్ ఎర్త్ 2019 డాక్టర్ తేజస్విని మనోజ్ఞ కూడా సాయంత్రం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

### ఏనుగుల కడుపు నిండగా..

తిరుపతి ఎస్వీ జూ పార్కులో మంగళవారం ఏనుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తాజా పండ్లు, కూరగాయలను వాటికి ఆహారంగా అందించారు. ఏనుగుల సంరక్షణపై వీరికి అధికారులు అవగాహన కల్పించారు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. సబ్ డీఎఫ్‌వో నాగభూషణం, రేంజ్ ఆఫీసర్ జగదీష్, ఎడ్యుకేషన్ ఆఫీసర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(మంగళం), ఆంధ్రజ్యోతి





### సంతతి పెరుగుతోంది

ఏనుగుల సంతతి పెరుగుతోందని అధికారులు అంటున్నారు. అందుకు నిదర్శనం తిరుమలలోని ఎర్ర మట్టి దిబ్బల వద్ద ఏనుగు పిల్లలు జలకాలాడుతూ కెమెరాకు చిక్కాయంటూ మంగళవారం ఫొటో విడుదల చేశారు. ఏనుగుల గుంపు దగ్గరకు వెళ్లడం, ఫొటోలు తీయడం, సెల్ఫీ ప్రయత్నాలు చేయొద్దన్నారు. చీకటి పడ్డాక పొలాల్లోకి వెళ్లొద్దని అటవీ సమీప రైతులకు సూచించారు.

- తిరుపతి(మంగళం), ఆంధ్రజ్యోతి



## షార్‌లో కరపత్రాల కలకలం

● ఉద్యోగులను వేధిస్తున్నారంటూ ప్రచారం

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్)లో ఓ సీనియర్ ఉద్యోగి తన తోటి ఉద్యోగులను వేధించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ గుర్తు తెలియని వ్యక్తులు కరపత్రాలను వేయడం మంగళవారం కలకలం రేపింది. ఉద్యోగంతో పాటు అసోసియేషన్ సభ్యుడిగా ఉంటూ పాఠశాలలో మహిళ ఉద్యోగులను కూడా లైంగికంగా వేధిస్తున్నారంటూ కరపత్రాల్లో ప్రస్తావించారు. ఆరేళ్లుగా సేవా ముసుగులో వినాయకచవితి చందాలు కూడా వసూలు చేశారని, రియల్ ఎస్టేట్ పేరిట టోకరా వేస్తున్నారంటూ రెండు పేజీల ఆంగ్ల కరపత్రంలో ఆరోపణలు గుప్పించారు. షార్ సెంటర్‌తో పాటు సూళ్లూరుపేటలో కూడా అక్కడక్కడా ఇవి చక్కర్లు కొట్టాయి. కేఆర్‌పాలెం సమీపంలో షార్ ట్రాన్స్‌పోర్టు యాడ్ వద్ద కట్టలుగా పడివున్న కరపత్రాలను షార్ ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిసింది. విషయాన్ని బయటకు పొక్కనీయకుండా అలర్ట్ అయ్యారు. వెనువెంటనే వాటిని కనబడనీయకుండా తీసుకెళ్లారు.

## సీఎం ప్రారంభించాకనే 'ఉచిత ప్రయాణం'

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మరో రెండు రోజుల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమల్లోకి రానుంది. శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగని, శుక్రవారం వేకువజామున ఫస్ట్ బస్సు నుంచే ఉచిత ప్రయాణం సాధ్యం కాదు. ఆ రోజు సీఎం చంద్రబాబు ఏ సమయానికి ప్రారంభిస్తారో.. అప్పటి నుంచే టిక్కెట్స్ జారీచేసే టిమ్స్‌కు గ్రీన్ సిగ్నల్ వస్తుంది. ఈ విషయాన్ని మహిళలు గుర్తు పెట్టుకోవాలని అధికారులు చెబుతున్నారు.

## జీరో టికెట్ సిద్ధం

పుత్తూరు,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణానికి సంబంధించి జీరో టిక్కెట్ జారీకి టిమ్స్‌లలో ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానం పొందుపరిచారు.దీనిపై కండక్టర్లకు శిక్షణ ఇచ్చారు.పుత్తూరు డిపోలో 80 బస్సులు ఉండగా 55బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించనున్నారు.డిపో సర్వీసుల్లో ప్రతి రోజు 3500 మంది మహిళలు ప్రయాణిస్తుండగా ఉచిత ప్రయాణంతో మరో 20 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



## ప్రాణాలను నిలబెడదాం

● అవయవదానంతో మరికొందరికి పునర్జన్మ

6

● పోలీసుల నిర్లక్ష్యమూ కనిపిస్తోంది

# రాతియుగాన్ని తలపించేలా..!

## పవన్‌పై దాడి చేసిన నిందితులు

## రుయాలో బాధితుడిని పరామర్శించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాతియుగాన్ని తలపించేలా కొందరు కలిసి దళిత యువకుడైన పవన్‌పై విచక్షణారహితంగా దాడి చేయడం దురదృష్టకరమని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. దీనికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. వైసీపీ నేతల దాడిలో గాయపడి తిరుపతిలోని రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌కుమార్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. దాడికి గల కారణాలను, నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అట్రాసిటీ చట్టం ప్రకారం ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రాయితీలను అందిస్తామన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పవన్‌కుమార్‌పై 25 మందికి పైగా దాడికి పాల్పడగా, వీరిలో 16 మందిని గుర్తించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారన్నారు. వీరిలో కొందరిని అదుపులోకి కూడా తీసుకున్నారన్నారు. తిరుపతి వంటి పుణ్యక్షేత్రంలో ఇటువంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. ఇప్పటికే ఎస్పీతో మాట్లాడి బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. కర్రలు, లాఠీలతోనే కాకుండా బూటు కాలుతో తన్నిన గాయాలు ఇంకా ఉన్నాయన్నారు. ఎవరి అండతో దాడికి పాల్పడ్డారనేది బయటకు వస్తాయన్నారు. అవసరమైతే ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన నిందితులపై చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. ఇంకా అట్రాసిటీ చట్టాలను ఉల్లంఘిస్తూ దళితులపై దాడులకు తెగబడుతున్న వారికి గుణపాఠం చెప్పేలా చట్టాలను కఠినంగా అమలు చేస్తామన్నారు. పవన్‌కుమార్‌పై దాడి వీడియో బయటకు వచ్చిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే అదేరోజు పవన్‌కుమార్‌ను గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకునే అవకాశం ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు. బాధితుడిని బెదిరించి మరో వీడియో తీసే అవకాశం ఉండేది కాదన్నారు. ఈ విషయంలో పోలీసుల నిర్లక్ష్యంగా కూడా కనిపిస్తోందని ఆరోపించారు. బాధితుడిని దాచిపెట్టిన ఇంటిని కూడా వేలం వేసి ఆ నగదును బాధితుడికి ఇచ్చేలా విధంగా చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, మాజీ మంత్రి పరసారత్నం, నేతలు సూరజ్, శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌కు దెబ్బలు చూపిస్తున్న పవన్ కుమార్



## వెయ్యి అడుగుల జెండా



తిరుపతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): 'హర్‌ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం తిరుపతిలో వెయ్యి అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్, టూరిజం, ఎస్వీ యునివర్సిటీ సంయుక్తంగా మహతి నుంచి ఎస్వీయూ స్టేడియం వరకు ఈ ర్యాలీ సాగింది. 'ప్రతి ఇంట్లో జెండా ఎగురవేసేలా ప్రోత్సహించడానికి రెండు వారాల కార్యక్రమం రూపకల్పన చేశాం. సెల్ఫీ పాయింట్ వద్ద సెల్ఫీ దిగి అప్లోడ్ చేస్తే సర్టిఫికెట్ ఇస్తారు. దేశభక్తిని ఒక రోజుకే పరిమితం చేయకుండా, ప్రతి రోజూ మన పనుల్లో ఆ స్ఫూర్తి కనిపించేలా ఉండాలి. మన పరిసరాలను, నగరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత. యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి' అని కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, ఏపీ జీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, వూకా విజయ్ కుమార్, టూరిజం ఆర్డీ రమణ ప్రసాద్, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జనార్దన్‌రెడ్డి, కార్పొరేటర్లు నరసింహ ఆచారి, నరేంద్ర, రేవతి, కాంచన, కుమారి, అన్నా అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామగ్రామాన కమల వికాసం

● ప్రజాసమస్యల పరిష్కారానికి వారధిగా ఉండాలి

● సారథ్యం సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపు



జ్యోతిప్రజ్వలన చేసి బీజేపీ విస్తృతస్థాయి సమావేశాన్ని ప్రారంభిస్తున్న మాధవ్



తిరునగరిలో 'సారథ్యం' ర్యాలీ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన కమల వికాసం జరిగేలా కృషి చేయాలని నేతలు, శ్రేణులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న ఆయన 'సారథ్యం' పేరిట జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం తిరుపతిలో జరిగిన సారథ్యం కార్యక్రమానికి మాధవ్ హాజరయ్యారు. ప్రజాసమస్యల పరిష్కారానికి వారధులుగా ఉండాలని శ్రేణులకు సూచించారు. జిల్లాలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచి, ఎంపీటీసీ, కౌన్సిలర్.. ఇలా ఏ అవకాశం వచ్చినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఇకపై నామినేటెడ్ పోస్టులకూ సర్దుబాటు చేసుకుంటామని తెలిపారు. టీటీడీ ఉద్యోగుల్లోని అన్యమతస్థులను వేరే సంస్థలకు పంపించాలని డిమాండు చేశారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా ఆనంద్ మాట్లాడుతూ, కూటమి ఎమ్మెల్యేలు బీజేపీ నాయకులను పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యేల తీరుతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇకపై ఎక్కువ సమయం తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంపై దృష్టి పెట్టాలని మాజీ ఎంపీ వరప్రసాద్‌ను కోలా ఆనంద్ కోరారు. నియోజకవర్గంలో తాను తిరిగినట్టు మరొక ఎంపీ, ఎంపీ అభ్యర్థి తిరగలేదని వరప్రసాద్ అన్నారు. అలాకాదని నిరూపిస్తే రాజకీయాలనుంచి విరమించుకుంటానని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, జల్లి మధుసూదన్, పార్థసారథి, బీడీ బాలాజీ, చంద్రప్ప, శాంతారెడ్డి, చంద్రారెడ్డి, ఎస్ఎస్ నాయుడు, కంద్రిగ ఉమ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు లక్ష్మీపురం సర్కిల్లోని శంకరంబాడి సుందరాచారి విగ్రహానికి మాధవ్, నేతలు పుష్పాంజలి ఘటించారు. సారథ్యం కార్యక్రమంలో భాగంగా లీలామహల్ సర్కిల్ నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక, ఉదయం 'చాయ్ పే చర్చ' కార్యక్రమంలో భాగంగా సామంచి శ్రీనివాస్‌తో కలిసి బైక్‌పై మాధవ్ తిరుపతిలో పర్యటించారు. బాబూ జగ్జీవన్‌రామ్ పార్క్ పరిసర ప్రాంతాల్లో పాదచారులతో మాట్లాడారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి వివరాలు తెలుసుకున్నారు. సిటీ బస్సులు నడపాలని, యూడీఎస్ మెరుగు పరచాలని పలువురు ఆయనకు సూచించారు.

**మేధావుల సదస్సు :** కాగా, సోమవారం రాత్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాపారుల, మేధావుల సదస్సులో మాధవ్ పాల్గొన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. పారిశ్రామికవేత్తలకు కేంద్రం రాయితీలు ఇస్తోందని, అందరూ ముందుకు వచ్చి రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. పారిశ్రామికవేత్త పృథ్వీరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్ అసోసియేషన్, ఆటోమొబైల్ అసోసియేషన్, క్రెడాయ్ ప్రతినిధులు, బిల్డర్లు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలో 'స్మార్ట్' నిధుల దుర్వినియోగం

● బోగస్ ఓట్ల విషయమై కేంద్రాన్ని అడిగి తెలుసుకుంటా

● మీడియా చిట్‌చాట్‌లో బీజేపీ అధ్యక్షుడు మాధవ్

తిరుపతి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించడమే కాదు.. కేంద్రం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులనూ దుర్వినియోగం చేశారని బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. తిరుపతిలో మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. 'స్మార్ట్ సిటీ నిధులను ఇతర పనులకు వాడేశారు. చాలాచోట్ల దుర్వినియోగం చేశారు. కేంద్ర ప్రభుత్వం గైడ్‌లైన్స్ కఠినంగా పెట్టినా వైసీపీ లెక్కపెట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటునూ ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఈసారి స్మార్ట్‌సిటీలకు ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం అమృత్2.0 తీసుకొచ్చింది' అని వివరించారు. గత ప్రభుత్వంలో వైద్యశాఖలోనూ పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగిందన్నారు. నైట్ ల్యాండింగ్ సౌకర్యం లేకపోవడం, అధికారుల నియామకాలు జరిగితే విదేశీ విమాన రాకపోకలు జరగొచ్చు. తిరుపతి మీదుగా తిరువణ్ణామలైకి రైలు సౌకర్యంపైనా ప్రయత్నిస్తా'నని చెప్పారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక సందర్భంగా 35 వేల బోగస్ ఓట్లు ఎక్కించిన కేసు ఇప్పటికీ విచారణలోనే ఉండడం వెనుక కేంద్ర ప్రభుత్వం వైసీపీకి అనుకూలంగా ఉందన్న ప్రచారం జరుగుతోందన్న మీడియా ప్రశ్నకు మాధవ్ స్పందించారు. ఈకేసు విషయం తన దృష్టికీ వచ్చిందని, పూర్వాపరాల గురించి కేంద్రాన్ని అడిగి తెలుసుకుంటానన్నారు. తన పర్యటన సందర్భంగా కేడర్‌లో నూతనోత్సాహం కనిపిస్తోందన్నారు.




# వా(ప్రే)మ హస్తం

తిరుపతి ఆంధ్రజ్యోతి

ఎడమచేతి వాటం కలిగిన వారిని ఒకప్పుడు పుర్రచెయ్యోడు, లొడ్డోడు.. అని ఎగతాళి చేసేవారు. ఎడమచేతిని వాడడం ఏ రకంగానూ లోపం కాదు. అయినా ఇప్పటికీ కుటుంబాల్లో కూడా ఎంతో కొంత గాయపడే మాటలు విసురుతూనే ఉంటారు. బలవంతంగా కుడి చేతిని వాడాలని వేధిస్తుంటారు. ఆడా, మగా సమానం అన్నట్టే.. కుడి, ఎడమల్లోనూ తేడా లేదు. ఒకటి బలమైనది, మరొకటి బలహీనమైనది కానేకాదు. ఏది ఎక్కువగా వాడితే అది ఆ పనులకు అలవాటవుతుంది అంతే. ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఎడమ చేతివాటం వారని అంచనా. ఎడమచేతి వివక్షను సమాజంలో పోగొట్టాలనే ఉద్దేశ్యంతో నేడు లెఫ్టహ్యాండర్స్‌డే జరుపుకుంటున్నారు.

### లెఫ్ట్ హ్యాండర్స్ అనుకూలతలు

- బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో కుడిచేతి వారికంటే త్వరగా ఎడమచేతివారు కోలుకుంటారు.
- క్రీడాకారులకు ప్రయోజనం ఎక్కువ
- టైపింగ్‌లోనూ వేగం, ● మెదడులోని ఎడమ, కుడి భాగాలతో మెరుగైన అనుసంధానం
- పార్కిన్‌సన్స్ వ్యాధి వచ్చే అవకాశాలు తక్కువ.
- నీటిలోపల చూసే సామర్థ్యం ఎక్కువ.



### సర్జరీల్లోనూ సమస్య లేదు

చిన్నతనం నుంచి నాకు ఎడమ చేతివాటమే. ఎక్కడా ఇబ్బంది రాలేదు. యాదృచ్ఛికమే అయినా నా భర్త డాక్టర్ హరిబాబుది కూడా ఎడమ చేతివాటమే. ఆయన చిత్తూరు అపోలో హాస్పిటల్‌లో ఆర్థోపెడిక్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. సర్జరీల్లో మాకు ఎప్పుడూ ఏ సమస్యా రాలేదు. ఏ తేడా అనిపించలేదు.

- డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి




### ఎడమచేతిని అడ్డుకోవద్దు

కుడి చేత్తో రాయడంవల్ల మెదడులోని ఎడమ అర్ధగోళం (భాష, లాజిక్ పనిచేసే ప్రదేశం) పని చేస్తుంది. ఎడమ చేత్తో రాయడం వల్ల కుడి అర్ధగోళం (సృజనాత్మకత, స్పేస్ అవగాహన గల ప్రదేశం) పని చేస్తుంది. అదే రెండింటినీ ఉపయోగించడం వల్ల కార్పస్ కాలాసమ్ (రెండు అర్ధగోళాలను కలిపే సేతు) బలపడుతుంది. చేతుల కదలికలను నియంత్రించే మెదడు భాగం కొత్త కదలికలను నేర్చుకుంటుంది. ఈకొత్త న్యూరల్ కనెక్షన్లు కొత్త పనికి అలవాటు పడే క్రమంలో కొత్త విషయాలను వేగంగా నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుంది. రెండు చేతుల సమన్వయం మెరుగవుతుంది. టైపింగ్, సంగీత వాయిద్యాలు వాయించడం, ఆటల్లో చురుకుదనం, వేగం పెరుగుతాయి. పిల్లలు ఎడమ చేయి వాడుతుంటే అడ్డుకోవద్దు. వీలైతే రెండు చేతులూ వాడేలా ప్రోత్సహించండి.

- భాస్కర్ రాజు, మేక్‌మైబేబీ జీనియస్ స్కూల్ వ్యవస్థాపకుడు

### సవ్యసాచి సంగరాజు

కుడి, ఎడమ తేడా లేదని నిరూపిస్తున్నారు సంగరాజు అశ్విని. రెండు చేతులతోనూ ఆమె ఒకే వేగంతో రాయగలరు. ఇంకా విశేషం ఏమిటంటే ఒకేసారి కుడిచేత్తో ఒక భాష, ఎడమ చేత్తో మరో భాషలో రాయడం. అక్షరాల అందంలోనూ కుడిచేతికీ, ఎడమ చేతికీ తేడా ఉండదు. ప్రస్తుతం తిరుపతిలోని మేక్‌మైబేబీ జీనియస్ స్కూల్ డైరెక్టర్‌గా ఉన్న అశ్విని..ఎడమచేతిని వాడే తమ విద్యార్థుల్లో న్యూనతను పోగొట్టడానికి తాను రాసి చూపిస్తుంటారు.



## టీటీడీ విరాళంగా బ్యాటరీ బుగ్గీలు






టీటీడీకి మంగళవారం రెండు బ్యాటరీ బుగ్గీలు విరాళంగా అందాయి. బెంగుళూరుకు చెందిన చంద్రశేఖర్ అనే భక్తుడు రూ.11 లక్షలు విలువైన ఈ బ్యాటరీ వాహనాలను అందజేశారు. ఆలయం ముందు పూజలు చేసి, వాహనాల తాళాలను ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## 15నుంచి ఆడికృత్తిక ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా తిరుత్తణికి మూడు రోజుల పాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. 222 (15న 65, 16న 88, 17న 69) బస్సులతో తిరుత్తణికి, అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో గమ్యస్థానాలకు చేరవేయనున్నట్లు డీపీటీవో జగదీష్ ఓ ప్రకటనలో కోరారు. బస్సుల వివరాలిలా... ● తిరుపతి-తిరుత్తణి వయా నగరి - శుక్రవారం 4, శనివారం 5, ఆదివారం 5 ● అదేవిధంగా పచ్చికాపల్లం-తిరుత్తణి వయా నగరి 10, 20, 10 ● పుత్తూరు-తిరుత్తణి వయా పల్లిపట్టు 4, 6, 4 ● పుత్తూరు-తిరుత్తణి వయా నగరి 12, 12, 12 ● నగరి-తిరుత్తణి 5, 5, 5 ● కొత్తపల్లిమిట్ట-తిరుత్తణి వయా నగరి 10, 15, 15 ● సత్యవేడు-తిరుత్తణి వయా నాగలాపురం 10, 15, 10 ● నాగలాపురం-తిరుత్తణి 5, 5, 5 ● తిరుపతి-పాకాల - శుక్రవారం 5, శనివారం 5, ఆదివారం 3 చొప్పున బస్సులు నడుస్తాయి.

## సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.84 కోట్లు**


**సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,740**

**తలనీలాలు సమర్పించినవారు: 34,958**



# ప్రాణాలను నిలబెడదాం

రాజంపేటకు చెందిన 15ఏళ్ల స్పందనకు గుండె మార్పిడి చేయకపోతే ప్రాణాలకు ముప్పు వస్తుందని వైద్యులు తెలిపారు. కూలీ పనులు చేసుకునే ఆమె తల్లిదండ్రులు తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయను ఆశ్రయించారు. వైద్యులు వెంటనే బాలిక వివరాలను జీవన్‌ధాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. నెలరోజుల తర్వాత గుంటూరుకు చెందిన ప్రసాద్(40) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అతని గుండెను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. హృదయాలయ వైద్యులు గుంటూరు వెళ్లి ప్రసాద్ గుండెను ఆగమేఘాలపై సేకరించారు. స్పందనకు అమర్చారు. ఇప్పుడు ఆ బాలిక చదువు కొనసాగిస్తోంది.



పూతలపట్టు మండలం సామనత్తంకు చెందిన బీటెక్ విద్యార్థి గొల్లపల్లి హేమకుమార్(24) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. అతని తల్లిదండ్రులు తమ బిడ్డ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో వైద్యులు గుండెను పద్మావతి హృదయాలయానికి తరలించి 29 ఏళ్ల వ్యక్తికి అమర్చారు. గంగవరం మహిళకు కాలేయం, పూతలపట్టు మహిళకు కిడ్నీని అమర్చారు. ఒక వ్యక్తి అవయవాలు ముగ్గురి ప్రాణాలను నిలబెట్టింది.

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మరణించినా మరొకరిలో జీవించి ఉండాలంటే అయయవదానమొక్కటే మార్గం. పెద్ద మనసుతో స్పందిస్తే మరికొంతమంది ప్రాణాలను నిలపవచ్చు. అయితే అవయవదానంపై చాలామందికి సరైన అవగాహన లేదు. పైగా సెంటిమెంట్లు, అపోహలు తోడవుతున్నాయి. ఫలితంగా మరొకరి ప్రాణాలు నిలబెట్టే అవయవాలు మట్టిలో కలిసి పోతున్నాయి. ఒకప్పుడు ప్రధాన అవయవాలు చెడిపోతే మరణం తప్ప గత్యంతరంలేదు. ఇప్పుడు వైద్యరంగంలో వచ్చిన అధునాతన మార్పులతో అవయవాల మార్పిడి ద్వారా ఎందరో ప్రాణాలను నిలబెడుతున్నారు. ఎదురవుతున్న చిక్కల్లా ఎక్కువ మంది దాతలు ముందుకు రాకపోవడమే. వెంటాడుతున్న అవగాహనారాహిత్యమే.



గుంటూరులో దాత నుంచి సేకరించిన గుండెను పద్మావతి చిన్నపిల్లల హృదయాలయకు తీసుకు వస్తున్న వైద్యుడు

world organ donation day

## అవయవదానంతో మరికొందరికి పునర్జన్మ

**నేడు అవయవదాన దినోత్సవం**

## అవరోధంగా మారుతున్న అవగాహనారాహిత్యం

### జీవన్‌ధాన్ పోర్టల్‌లో వివరాలు నమోదు

బ్రెయిన్ డెత్, లేదా ఇతర కేసుల్లో అవయవాలను దానం చేసేందుకు దాతలు ముందుకు వస్తే గ్రహీతలకు అందించేందుకు ప్రభుత్వం జీవన్‌ధాన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. గుండె, లివరు, కిడ్నీ వంటి ప్రధాన అవయవాలు పాడైన వారి వివరాలను ఇందులో నమోదు చేసుకుంటున్నారు. దాత దొరికితే జీవన్‌ధాన్ పోర్టల్లో బాధితులకు సమాచారమిస్తున్నారు. వెంటనే ఆ అవయవాలను మార్చి బాధితుల ప్రాణాలు నిలబెడుతున్నారు. పోర్టల్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే మొదట అవకాశం కల్పిస్తుండటం, మిగిలిన వారికి దాతలు దొరికే వరకు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండటంతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతి పది నిముషాలకు ఒకరు పోర్టల్ జాబితో చేరుతుండగా, నమోదు చేసుకున్న వారిలో రోజుకు 20 మందికి పైగా ప్రాణాలు విడుస్తున్నట్లు సమాచారం. పది శాతం మందిని మాత్రమే అవయవ మార్పిడితో రక్షించగలుగుతున్నారు.అవయవదానంపై అవగాహన లోపం కారణంగానే ఇలాంటి పరిస్థితి దాపురిస్తోంది.

### మన జిల్లాలో ఇలా..

- తిరుపతిలోని టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 20 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయి. వీరిలో మూడు నెలల చిన్నారుల నుంచి 55 ఏళ్ల వయసున్న వారు కూడా ఉన్నారు.
- ఏడాది కిందట స్విమ్స్‌లో బ్రెయిన్ డెడ్‌కు గురైన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ముగ్గురి ప్రాణాలు నిలబెట్టారు.
- కుటుంబ సభ్యులతో అనుమతితో మృతుల కళ్లను రుయాస్పత్రి ఐ-బ్యాంక్ సేకరిస్తోంది. మరణానంతరం కళ్లు దానం చేసేందుకు ముందుకు వచ్చే వారి వివరాలను కూడా నమోదు చేసుకుంటున్నారు. సేకరించిన కళ్లను అవసరమైన వారికి అమర్చి వెలుగులు నింపుతున్నారు.

### వీరి అవయవాలు దానం చేయవచ్చు

వివిధ సంఘటనల్లో బ్రెయిన్ డెడ్‌కు గురైన వారి అవయవాలన్నీ ఇతరులకు ఉపయోగపడతాయి. వైద్యుల పర్యవేక్షణలో మరణించిన వారివి కూడా కొన్ని అవయవాలు ఉపయోగపడతాయి. జీవించి ఉన్న వారు కిడ్నీ, కాలేయం వంటి అవయవాలను ఇవ్వవచ్చు. ఒకరి నుంచి సేకరించిన గుండె, కిడ్నీ, లివర్, కళ్లు, ఊపిరితిత్తులు, చిన్నపేగులతో ఎనిమిది మందికి పునర్జన్మ కలుగుతుంది. తీవ్రమైన అంటు వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిక్‌తో అధికంగా బాధపడే వారి అవయవాలు పనికిరావు.



### అవగాహన పెరగాలి

మరణించాక శరీరంతోపాటు అవయవాలను మట్టిలో కలిసిపోనీయకుండా కుటుంబ సభ్యులు ముందుకు రావాలి. గుండె మార్పిడి కోసం అనేక మంది ఎదురు చూస్తున్నారు. బ్రెయిన్‌డెడ్‌కు గురైన వారి అవయవాలను ఇటువంటి వారికి దానం చేస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహనతో స్పందించాలి.

- డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్

### 8 మందికి పునర్జన్మ



బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో 8మంది ప్రాణాలను రక్షించవచ్చు. ఒకప్పుడు కిడ్నీ, లివర్ వంటివి మార్పిడీ చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం గుండెను సైతం మార్చుతున్నారు. కిడ్నీ, లివర్ వంటి అవయాలను దానం చేసేందుకు ఆరోగ్యవంతులైన వారు అర్హులు. ఒక కిడ్నీ, లివర్‌లో కొంత భాగం దానం చేశాక కూడా మామూలుగా బతకవచ్చు. అవయవదానానికి మించిన దానం మరొకటి లేదు.

- డాక్టర్ పీవీ రజనీకాంత్, లివర్ ట్రాన్స్‌ప్లాంటర్







బహుమతి పొందిన వాటిలో లావణ్య కుమార్, సాయికుమార్ తీసిన ఫొటోలు

## 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

తిరుపతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ డేని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో తిరుపతి ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు ఆర్.లావణ్యకుమార్, కె.సాయికుమార్‌లకు బహుమతులు లభించాయి. స్పాట్‌న్యూస్ ఫొటో విభాగంలో లావణ్యకుమార్ తీసిన కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుల ఫొటోకు అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. జనరల్ విభాగంలో తిరుమల నడకదారిలో ఐసు తింటున్న ఉడుత ఫొటో తీసిన సాయికుమార్‌కు అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించారు. ఆగస్టు 19న విజయవాడలో జరగనున్న వేడుకలో వారు అవార్డులు అందుకోనున్నారు.

## షార్ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): షార్ కొత్త డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి షార్ నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరారు. ఆమెతోపాటు నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, మాధవనాయుడు, సెల్వం తదితరులున్నారు.

## రుయాస్పత్రికి క్యాత్‌ల్యాబ్ మంజూరు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న గుండె సంబంధిత వ్యాధుల బాధితుల కోసం ప్రభుత్వం రుయాస్పత్రికి క్యాత్‌ల్యాబ్‌ను మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న రోజుల్లో రుయాస్పత్రి మెరుగైన గుండె వైద్యాన్ని పీపీపీ(పబ్లిక్ ప్రవేటు పార్టనర్‌షిప్) పద్ధతిలో అందించనుంది.

## హెచ్‌డీపీటీ ఛైర్మన్‌గా దాసరి శ్రీనివాసులు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) ఛైర్మన్‌గా బీజేపీ నేత, తిరుపతికి చెందిన దాసరి శ్రీనివాసులును రాష్ట్ర ప్రభుత్వ నియమించింది. ఏపీలో 31 నామినేటెడ్ పదవులను భర్తీచేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి అయిన దాసరి శ్రీనివాసులుకు ఈ పదవి దక్కింది. హిందూ ధర్మ పరిరక్షణార్థం మాజీ ఐఏఎస్ అధికారి పీవీఆర్కే ప్రసాద్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖకు అనుబంధంగా హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అంతటి ప్రతిష్టాత్మక ట్రస్ట్‌కు ఛైర్మన్‌గా నియమితులవడంపట్ల దాసరి శ్రీనివాసులు ఆనందం వ్యక్తం చేశారు.

## మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా బొమ్మన శ్రీధర్



తడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా తడ మండలానికి చెందిన మత్స్యకార నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. టీడీపీ ఆవిర్భావం నుంచి బొమ్మన కుటుంబం పార్టీలో కొనసాగుతోంది. శ్రీధర్ తండ్రి బొమ్మన సుందరయ్య మత్స్యకార గ్రామాల్లో టీడీపీ పటిష్టతకు ఎంతో కృషి చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో కేసులను ఎదుర్కొన్నారు.

## నులిపురుగు నివారణ మాత్రలతో మెరుగైన ఆరోగ్యం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో నులిపురుగు నివారణ(ఆల్బెండజోల్) మాత్రలు దోహదపడతాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా మంగవారం తిరుపతి నగరం కొర్లగుంటలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1-19 ఏళ్లలోపు ఉన్న 4,97,511 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన పలువురు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఐవో కుమార్, అధికారులు డాక్టర్ శ్రీనివాసవర్మ, డాక్టర్ సౌజన్యలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసులు, రెడ్డిప్రసాద్, కిరణ్‌కుమార్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న కలెక్టర్

## ● ఉపాధ్యాయుల చొరవతో

# నిరుపేద పిల్లల బడిబాట



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో సతీష్‌బాబు, ఉపాధ్యాయులు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇటుక బట్టీలో పని చేసే నిరుపేద దంపతులకు చెందిన ఇద్దరు పిల్లలను బడిబాట పట్టించడంలో ఎంఈవో, ఉపాధ్యాయుల శ్రద్ధ ఫలించింది. నెరబైలు పంచాయతీ తలకోన దారిలోని ఓ ఇటుక బట్టీలో పనిచేసేందుకు మూడు యానాది కుటుంబాలు వలస వచ్చాయి. వీరిలో గుండ్రాతి కుప్పం నాగరాజు, ధనలక్ష్మి దంపతులకు ఐదుగురు పిల్లలున్నారు. వీరిలో శ్రీనివాసులు, ముకేష్‌కు ఐదేళ్లు దాటినా పాఠశాలకు పంపలేదు. ఈ క్రమంలో మంగళవారం ఎంఈవో-2 సతీష్‌బాబు నెరబైలు మండల పరిషత్ మోడల్ స్కూల్‌కు తనిఖీకి వచ్చారు. బడికి రాని పిల్లల గురించి ఆరా తీశారు. సమీపంలోని ఇటుకబట్టీలో కూలీల పిల్లలు స్కూలులో చేరలేదని తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, టీచర్లతో కలిసి ఇటుక బట్టీ వద్దకు వెళ్లారు. ఉపాధ్యాయులను చూసిన పిల్లలు దూరంగా చెట్లచాటున దాక్కున్నారు. నాగరాజు, ధనలక్ష్మి దంపతులతో ఉపాధ్యాయులు మాట్లాడారు. పిల్లలకు ఆధార్ కార్డు లేదని వాళ్లు చెప్పగా.. తండ్రికి ఆధార్ కార్డు ద్వారా పిల్లలకు తామే ఇప్పిస్తామని ఎంఈవో తెలిపారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలిద్దరినీ స్కూలుకు పంపేందుకు అంగీకరించారు. వెంటనే శ్రీనివాసులు, ముఖేష్‌కు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ప్రవేశం కల్పించారు. పిల్లలకు దుస్తులనూ ఉపాధ్యాయులే సమకూర్చారు.



టీచర్లను చూసి చెట్టు చాటున దాక్కున్న పిల్లలు


## ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ హుస్సేన్ భాషా

చిట్టమూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి, అల్యూమినియం తీగలను ఎత్తుకెళ్లే ముఠాను అరెస్టు చేసినట్లు వాకాడు సీఐ హుస్సేన్ భాషా తెలిపారు. చిట్టమూరులో మీడియాకు వివరాలు వెల్లడించారు. మంగళవారం చిట్టమూరు ఎస్ఐ చిన్న బలరామయ్య ఆధ్వర్యంలో పోలీసులు మండల పరిధిలోని కలుగుర్తిపాడు వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో రాగి, అల్యూమినియం తీగలు ఉండడంతో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. మండలంలోని ఆరూరు అరుందతివాడకు చెందిన గంగిపంగి వెంకటేష్, యర్రబల్లి పోలయ్య, కంటేపల్లి కోటేశ్వరావు, కంటేపల్లి సుబ్బయ్య, కంటేపల్లి గిరిబాబు ముఠాగా ఏర్పడి రొయ్యల చెరువుల వద్ద, వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులో ఉన్న రాగి, అల్యూమినియం తీగలను చోరీ చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు వీరు చిట్టమూరు, కోట, వాకాడు, దొరవారిసత్రం మండలాల్లో 38 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి, అల్యూమినియం తీగలను ఎత్తుకెళ్లారు. వాహనంతో పాటు 175 కిలోల రాగి, 338 కిలోలు అల్యూమినియం తీగలను స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోట కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ హుస్సేన్ భాషా తెలిపారు.

## జగన్ పరిశ్రమలను తరిమేయడం వల్లే నిరుద్యోగ సమస్య: కురుగొండ్ల




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్ పరిశ్రమలను తరిమేయడం వల్లే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఏర్పడిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ విశ్వోదయ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ యువతకు ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకొనే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మూడు నెలలకోసారి జాబ్‌మేళా నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే ఇటీవల సింగపూర్‌కు వెళ్లి అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తే, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవద్దంటూ జగన్ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయశేఖర్, స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అధికారి లోకనాథం, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, మంకు ఆనంద్, మల్లారం బాబు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ ఏర్పాటు చేయండి




డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూఏ, ఏపీఎన్‌జీవో నాయకులు

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తక్షణమే పీఆర్సీ ఏర్పాటు చేయాలని ఎన్ఎంయూఏ, ఏపీఎన్‌జీవో నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్, ఏపీఎన్‌జీవో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేతన సవరణ గడువు ముగిసి రెండేళ్లు పూర్తయిందని, వెంటనే ఐఆర్ ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్మెంట్ చెల్లింపులు చేయాలని కోరారు. అలాగే ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు పదోన్నతులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రావణ్, తనూజ్, వెంకయ్య, బాషా, ప్రవీణ్, శ్రీనివాసులు, కృష్ణ, పోలయ్య, రమేష్, రఘు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాళంగి నదిలో నిమజ్జన ప్రాంతాల పరిశీలన

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా గణేశ్ ప్రతిమలను నిమజ్జనం చేసే కాళంగి నది ప్రాంతాలను మంగళవారం సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు పరిశీలించారు. నిమజ్జనం చేసే ప్రాంతాల్లో చేయాల్సిన ఏర్పాట్ల గురించి మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు లేఖ రాశారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో ఈనెల 16న సమావేశం నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు.

## ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దు



డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దంటూ మంగళవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు ఎస్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గవర్నర్‌పేట-2 డిపోకు సంబంధించిన 4.5 ఎకరాలను లులూ సంస్థ కేటాయించిన జీవోను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శేఖర్, కరుణాకర్ రెడ్డి, రాధాయ్య, రమేష్, ఆనంద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ ఎస్ఏసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. అంతకుముందు జాతీయ నులిపురుగుల దినోత్సవ సందర్భంగా విద్యార్థులు నులిపురుగుల నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు ఏడు కొండలు, శ్రీనివాసులు, జీకే ప్రసాద్ అమ్మాజీ, లైబ్రేరియన్ రమేష్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులను అడ్డుకున్న మహిళలు

నాయుడుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోతువానిగుంట ముఖ ద్వారం వద్ద మున్సిపాలిటీ సిబ్బంది చేపడుతున్న డ్రైనేజీ పనులను మహిళలు అడ్డుకున్నారు. బీఎంఆర్ నగర్ కాలనీ నుంచి వచ్చే డ్రైనేజీ వాటర్‌ను లోతువానిగుంట కాలువ వద్ద కలుపుతుండగా కాలనీవాసులు అడ్డుకొని నిరసన తెలిపారు.

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి

### లారీ బోల్తా

దొరవారిసత్రం, అస్టు 12(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కలగుంట రైల్వే వంతెన సమీపంలో మంగళవారం లారీ బోల్తా పడింది. తెల్లరాయి లోడుతో చెన్నై వెళుతున్న లారీ తెల్లవారుజామున అదుపు తప్పడంతో రహదారి పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

### బస్సును ఢీకొన్న వ్యాన్

దొరవారిసత్రం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నెలబల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న బస్సును వ్యాన్ వెనుక నుంచి ఢీకొంది. సూళ్లూరుపేట హోటళ్లలో మిగిలిపోయిన వ్యర్థ పదార్థాలను తీసుకుని నెల్లూరు వైపు వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి బస్సును వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం దెబ్బతినగా, డ్రైవర్ నాగూర్ స్వల్పం గాయపడ్డాడు.

## గ్రంథాలయ సేవలేవీ?

- మూడేళ్లుగా లైబ్రేరియన్ పోస్టు ఖాళీ
- పది నెలలుగా తలుపులు తెరిస్తే ఒట్టు




జాతీయ గ్రంథాలయ దినోత్సవం నాడూ మూసివున్న లైబ్రరీ

సూళ్లూరుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణ వాసులకు పది నెలలుగా గ్రంథాలయ సేవలు అందుబాటులో లేవు. ఇక్కడ లైబ్రేరియన్ పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉంది. నెల్లూరులో పనిచేసే సహాయకుడిని సూళ్లూరుపేట లైబ్రరీ ఇన్‌చార్జిగా నియమించడంతో ఆయన వారంలో మూడు రోజులు ఇక్కడ విధులు నిర్వహించేవారు. గడిచిన పది నెలల నుంచి ఆ ఉద్యోగిని నెల్లూరుకే పరిమితం చేయడంతో లైబ్రరీ తలుపులు తెరుచుకోవడం లేదు. సూళ్లూరుపేట గ్రంథాలయానికి సహాకుడిని నియమిస్తామని జిల్లా అధికారులు చెబుతున్నా ఆ దిశగా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. నెలల తరబడి గ్రంథాలయం తెరవకపోవడంపై పలువురు ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. కనీసం జాతీయ గ్రంథాలయ దినోత్సవమైన మంగళవారం నాడు కూడా తలుపులు తెరవకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీ ప్రజలు చెల్లిస్తున్న పన్నుల్లో 8 శాంత మేర జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.లక్షల్లో చెల్లిస్తున్నా నియోజకవర్గ కేంద్రంని గ్రంథాలయానికి లైబ్రేరియన్‌ను నియమించకపోవడం ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోజూ లైబ్రరీ తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## గంజాయి విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి, డ్రగ్స్ నిషేధిత మత్తుపదార్థాలు విక్రయాలు సాగించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో గంజాయి విక్రయాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఇటీవల ఆస్పత్రి రోడ్డులోని ఓ దుకాణం వద్ద గంజాయి విక్రయాలకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. పట్టణంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతిని తీసుకోవాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతియుత సమాజానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'పట్టమని పది రోజులే, యథావిధిగా రోడ్లపై వాహనాల పార్కింగ్, పట్టణ వాసులకు తప్పని ట్రాఫిక్ తిప్పలు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో పోలీసులు స్పందించారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు పట్టణంలో తిరుగుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలు, దుకాణ యజమానులను హెచ్చ రించారు. రోడ్లపై అడ్డదిడ్డంగా, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా పెట్టిన వాహనదారులకు జరిమానా విధించారు. బజారు వీధుల్లో దుకాణదారులు హద్దులుదాటి వస్తువులు పెడితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## నామినేటెడ్ పదవుల్లో జనసేనకు ప్రాధాన్యం ఇవ్వండి

వెంకటగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల కేటాయింపులో జనసేన నాయకులకు తగు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీ నాయకుడు తోట కృష్ణయ్య ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను కోరారు. మంగళవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో తోట కృష్ణయ్య కలిశారు. ఇటీవల సొసైటీల నియామకాల్లో జనసేన నేతలకు కొన్ని డైరెక్టర్ పదవులు ఇచ్చినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపి శాలువాలు కప్పి సన్మానించారు. అదేవిధంగా ఆలయ కమిటీల్లో, సొసైటీ అధ్యక్ష పదువుల ఎంపికలోనూ జనసేన నాయకులు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జల్లెల రాజేష్, మాలే హరిప్రసాద్, కొండాపురం కస్తూరి, జి.సురేష్ బాబు, మస్తాన్, పగడాల వెంకటరమణ, స్వామి, ఎం.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు

## ఐకాన్ బోర్డు ప్రారంభం



ఐకాన్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జాతీయ రహదారిపై హోలిక్రాస్ సర్కిల్ ముఖద్వారం వద్ద రూ.4 లక్షలతో నూతనంగా నిర్మించిన ఐ లవ్ సూళ్లూరుపేట ఐకాన్ బోర్డును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మంగళవారం ప్రారంభించారు. ముఖ ద్వారంలో ఐకాన్ బోర్డు ఏర్పాటుకు ఎంఎం శ్రీనివాసులు రూ.2 లక్షలు ఇవ్వగా, మిగిలిన రూ.2 లక్షలు మున్సిపాలిటీ నిధులతో నిర్మించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, చిట్టేటి పెరుమాల్, అలవల శ్రీనివాసులు, శ్రీధర్, ఆలీభాయ్, నలజాం రాము, బొమ్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్‌లో వ్యాసరచన పోటీలు

కోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్‌లో ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఇన్‌స్టిట్యూషన్, ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో యువశక్తి అంకుర పరిశ్రమ నైపుణ్యం, భారతీయ ఆవిష్కర్తకు స్ఫూర్తిదాయకం అనే అంశంపై ఇంజనీరింగ్ విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు జరిగాయి. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో పోటీల్లో పాల్గొనడం జరిగింది. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

## చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకూడదని తహసీల్దారు జయజయరావు, ఎస్ఐ పవన్ కుమార్ అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వినాయక చవితి ఉత్సవాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరిగింది. ఉత్సవాలు జరిపే గ్రామాల్లో ముందుగా అనుమతులు పొందాలన్నారు. ఎక్కడా యువతను రెచ్చగొట్టే విధంగా డ్యాన్స్‌లు, డీజేలు నిర్వహించరాదన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

చిట్టమూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చవితి సందర్భంగా వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని వాకాడు సీఐ హుస్సేన్ భాషా తెలిపారు. చిట్టమూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ... చవితి ఉత్సవాలకు మండపాలు ఏర్పాటు చేసుకొనే వారు ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో డీజేలు పూర్తిగా నిషేధమని, మండపాల వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరిగితే ఉత్సవ నిర్వాహకులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎస్ఐ చిన్న బలరామయ్య ఉన్నారు.

## స్వమిత్వ సర్వే పక్కాగా నిర్వహించాలి

బాలాయపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) స్వమిత్వ సర్వే పక్కాగా నిర్వహించాలని డీడీవో వాణిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కడగుంట గ్రామంలో జరుగుతున్న స్వమిత్వ సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వమిత్వ సర్వే ద్వారా గ్రామాల్లో నివాస స్థలాల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అంతేకాకుండా నివాస స్థలాకు పూర్తి హక్కులు లభిస్తాయన్నారు. అనంతరం కడగుంట, బాలాయపల్లిలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాలను డీడీవో పరిశీలించారు. చెత్త సేకరణ, నిర్వహణపై పలు సూచనలు చేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలోని డిప్యూటీ ఎంపీడీవో గదిలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఆర్ముగం, లీలావతి, దయాకర్, నాయకులు చిత్తూరు ఈశ్వరయ్య, వప్పుతొట్టి మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న తెలుగుగంగ కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని సీఐ రమణ తెలిపారు. మంగళవారం సాయంత్రం జంగాలపల్లి వద్ద తెలుగుగంగ కాలువలో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## యువతి అదృశ్యం

సూళ్లూరుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని ఆబాక గ్రామానికి ఏలింబేటి లలితమ్మ తన కుమార్తె అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు



మహాలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావమణ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై అష్టలక్ష్మీలను కొలవుదీర్చి కలశంతో అమ్మవారి రూపాన్ని పెట్టి వేదపండితులు, మంత్రోచ్ఛరణల నడుమ పూజలు జరిపారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి వాలెంటరీ సంఘం అధ్యక్షుడు కాకి శ్రీమ్మూర్తి, కార్యదర్శి పైడిమర్రి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్‌బ్యాడ్మింటన్‌లో విద్యార్థినుల ప్రతిభ

తడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు తడ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు తేజ, కీర్తి ఎంపికయ్యారు. వారిని ఆచార్య భరద్వాజ సంస్థ సభ్యులు అభినందించి వారికి క్రీడాసామగ్రిని మంగళవారం అందజేశారు.

## ఘనంగా కుంభాభిషేకం



సంగమేశ్వరస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న వేద పండితులు

కోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల సంగమేశ్వర స్వామి ఆలయంలో మూడో రోజు మంగళవారం కుంభాభిషేకాలు ఘనంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక హోమాలు జరిగాయి. కామాక్షీదేవి నూతన విగ్రహాన్ని ప్రత్యేక పాలకుండలో ఉంచారు. అమ్మవారి విగ్రహంతో పాటు పలు విగ్రహాలను బుధవారం ప్రతిష్టించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం జరిగింది.

## ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని టీడీపీ నాయకుడు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం చెన్నూరు గ్రామంలో గ్రాస్‌రూట్స్ స్పోర్ట్స్ ఇనిషియేటివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అండర్-16 బాలుర విభాగంలో ఇండిపెండెన్స్ డే క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, రామ్‌గోపాల్, నాగూర్‌బాబు, అవినాష్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కుబడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో చంద్రశేఖర్

ఓజిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అధికారులు తమ శాఖల వివరాలు చదువుకుంటూ వెళ్లడం... ఎంపీటీసీలు దిక్కులు చూస్తూ కూర్చోవడం... సర్పంచులు గైర్హాజరవడం... కార్యదర్శులు, వీర్వోలు, పలుశాఖల అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టడం... ఇది మంగళవారం మంగళవారం ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఓజిలి మండల సమావేశం తీరు. ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ అధికారులు తీసుకున్న చర్యలను ప్రశ్నించాల్సిన ఎంపీటీసీ సభ్యులు నోరు మెదపలేదు. సమావేశంలో మాట్లాడమని ఎంపీడీవో విజయలక్ష్మి కోరినా ఎంపీపీ ఆసక్తి చూపలేదు. సమావేశానికి హాజరైన కొద్దిమంది అధికారులు తమశాఖల్లో పురోగతి నివేదికను యథాలాపంగా చదివి మమ అనిపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్‌నాయుడు, తహసీల్దారు పద్మావతి, అత్తివరం, ఆరిమేనిపాడు ఎంపీటీసీ సభ్యులు శేఖర్, గుంటమడుగు రఘురామరాజు, డాక్టర్ హిమజ, వ్యవసాయాధికారి వరప్రసాద్, ట్రాన్స్‌కో ఏఈ అనీల్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవివర్మ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలోనే అవినీతి, అక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కొండలను సైతం కరిగించి అవినీతి, అక్రమాలుకు పాల్పడ్డారని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు శిరసనంబేడు, రోసనూరు కొండలు తవ్వి కోట్లాది రూపాయలు స్వాహా చేశారని ఆరోపించారు. కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి చిల్లకూరులో నిర్మిస్తున్న కోళ్లఫారం విషయంలో టీడీపీ నాయకులపై చేస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమలను నెలకొల్పి అభివృద్ధిని కాంక్షిస్తుందే తప్ప అవినీతికి పాల్పడదన్నారు. మరోసారి టీడీపీపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, శేఖర్‌నాయుడు, కృష్ణమనాయుడు, పాలచ్చూరు నరేంద్రయాదవ్, సన్నాడి వేణురెడ్డి, ఎల్లంటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లతో పేదలపై భారం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పేదలపై చార్జీల భారం పడుతుందని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం నాయుడుపేట విద్యుత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఆ సంఘ నేత శివకవి ముకుంద మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపడం సబబుకాదన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు కాలేషా, వెంకటయ్య, శ్రీనివాసులు, రామచంద్రయ్య, నాగరాజు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అభిషేక్

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని మనస్తత్వవేత్త, కెరీర్ కౌన్సెలర్ అభిషేక్ అన్నారు. మంగళవారం స్థానిక ఎల్ఏపీ పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల మానసిక ఒత్తిడిని తగ్గించుకుని సులభతరమైన పద్ధతిలో విద్యాభ్యాసం సాగించాలన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా, ఏకాగ్రతతో పట్టుదలతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం కళాశాల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, డాక్టర్ ఫీర్‌కుమార్, షైమూన్, విజయమహేష్, నారాయణ రాజు, శైలజ, సురేంద్ర, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు